


www.tharanam.net

# తరణం
# THARANAM

POSTAL REG-NUMBER CDP/035/2023-2025
RNI NO APTEL/2016/69526

**తరణం శుభమస్తు**
**శుక్రవారం జనవరి 12,2024**
శ్రీ శోభకృత్ నామ సంవత్సరందక్షిణాయనం - హేమంత ఋతువుపుష్యమి మాసం - శుక్లపక్షంతిథి:పాడ్యమి సా4.30 వరకువారం:శుక్రవారం (భృగువాసరే)నక్షత్రం:ఉత్తరాషాఢ సా5.44 వరకు యోగం:హర్షణం సా4.41 వరకు కరణం:బవ సా4.30 వరకు తదుపరి బాలువ రా3.29 వరకువర్జ్యం:రా9.30 - 11.01దుర్ముహూర్తము:ఉ8.50 - 9.34మ12.30 - 1.14అమృతకాలం:ఉ11.37 - 1.09 మరల తె.6.34నుండిరాహుకాలం:ఉ10.30 - 12.00యమగండ/కేతుకాలం:ఉ3.00 - 4.30
సర్వేజనా సుఖినో భవంతు -శుభమస్తు
వి మల్లికార్జున స్వామి

సంపుటి : 08 సంచిక : 114 వైఎస్ఆర్/కడప శుక్రవారం 12 జనవరి 2024 ఎడిటర్.. నీలం ఆంజనేయ రెడ్డి పేజీలు :08 వెల: రూ. 4.00

Vol : 08 Issue : 114 YSR/KADAPA Friday 12 January 2024 Editor. Neelam .Anjaneya Reddy Pages:08 Rs. 4.00

# ప్రపంచ ఆర్థికాభివృద్ధి ఇంజిన్‌గా భారత్

గాంధీనగర్: జనవరి 11 (తరణం బ్యూరో) ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అనిశ్చితులు నెలకొన్న వేళ భారత్ ఓ సరికొత్త ఆశాకిరణంలా ఉద్భవించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.భారత్‌ను ప్రపంచ దేశాలు స్థిరత్వానికి మూలస్తంభంగా, విశ్వసనీయమైన మిత్రుడిగా, ప్రపంచ ఆర్థికాభివృద్ధి ఇంజిన్‌గా చూస్తున్నాయని ఉద్ఘాటించారు. వచ్చే కొన్నేళ్లలో భారత్ ప్రపంచంలోని మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతుందని ప్రముఖ రేటింగ్ సంస్థలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో బుధవారం నిర్వహించిన 10వ వైబ్రెంట్ గుజరాత్ ప్రపంచ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జయీద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన రాక భారత్-యూఏఈ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్థిరత్వానికి మూల స్తంభంగా, విశ్వమిత్రగా (ప్రపంచ దేశాల మిత్రుడిగా), సమస్యలకు పరిష్కారాలు కనుగొనగలిగే సాంకేతిక కేంద్రంగా, ప్రతిభావంతులైన యువత కలిగిన శక్తిమంతమైన కేంద్రంగా భారత్‌ను అంతర్జాతీయ సమాజం చూస్తోంది. ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించగలమనే భావనను ప్రపంచ దేశాలకు భారత్ కలిగించింది. ఇటీవలే భారత్ 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను చేసుకుంది.రాబోయే 25 ఏళ్లు భారత్‌కు అమృత కాలం. ఈ 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.




ప్రపంచంలో భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనేందుకు నాది భరోసా" అని ప్రధాని మోదీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహార పార్కులు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో సహకారం, ఆరోగ్య రంగంలో పెట్టుబడులకు సంబంధించి భారత్-యూఏఈ మధ్య ఒప్పందాలు జరిగాయి

# 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్:

### నిర్మలా సీతారామన్



గాంధీనగర్: జనవరి 11 (తరణం బ్యూరో)భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు2027-28 నాటికి 5ట్రిలియన్ డాలర్లతో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లో జరుగుతున్న 'గుజరాత్ అంతర్జాతీయ సదస్సు 2024' లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.'2027-28 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే అవకాశం ఉంది. అదే ఏడాదిలో జీడీపీ 5 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుంది. అంచనా ప్రకారం.. 2047 నాటికి ఆర్థిక వ్యవస్థ దాదాపు 30 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం అమెరికా, చైనా, జపాన్, జర్మనీల తర్వాత దాదాపు 3.4 ట్రిలియన్ డాలర్లతో భారత్ ఐదో ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. ఈ ఏడాదిలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.3శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు.23 సంవత్సరాల్లో (2022 నుంచి 2023 వరకు) 919 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయన్నారు. వీటిలో 65శాతానికి (595 బిలియన్ డాలర్లు) పైగా పెట్టుబడులు గత 8-9 ఏళ్ల మోదీ పాలనలోనే సాధ్యమైందన్నారు. బ్యాంకు ఖాతాల గురించి ప్రస్తావిస్తూ.. 2014లో 15 కోట్ల మంది ప్రజలకు మాత్రమే బ్యాంక్ ఖాతాలు ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 50 కోట్లకు పెరిగిందని కేంద్రమంత్రి తెలి

# సీఎం స్టాలిన్ 'పొంగల్' గిఫ్ట్.. ₹1000 నగదు, చెరకు గడ పంపిణీ



చెన్నై: జనవరి 11 (తరణం బ్యూరో)సంక్రాంతి వేళ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'పొంగల్' కానుక ను పంపిణీ చేశారు. రాష్ట్రంలోని దాదాపు 2 కోట్ల మంది రేషన్‌కార్డు దారులకు రూ.1000 నగదుతో పాటు బియ్యం, పంచదార, చెరకు గడలను అందజేసే ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారుపండుగ వేళ ఇంట్లో ఆనందాన్ని నింపే ఈ కార్యక్రమాన్ని అళ్వార్‌పేటలో ప్రారంభించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం అందరి హృదయాల్లో, ఇళ్లల్లో వర్ధిల్లాలని, ప్రతిచోటా ఆనందం నిండాలని ఆకాంక్షించారు. దీంతో పాటు లబ్ధిదారులకు ఉచిత ధోతీ, చీరల పంపిణీని సైతం ప్రారంభించారు.తమిళనాడులోని 2కోట్ల మందికి పైగా రేషన్ కార్డుదారులతో పాటు పునరావాస శిబిరాల్లోని శ్రీలంక తమిళులకు రూ.1000 నగదుతో పాటు చెరకు గడ, కిలో బియ్యం, కిలో పంచదారను 'పొంగల్' కానుకగా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ కానుకల పంపిణీలో జనం రద్దీని నివారించేందుకు టోకెన్లు జారీ చేశారు. ఎవరు ఏ రోజు, ఏ సమయంలో రేషన్ దుకాణం వద్దకు వచ్చి కానుకలను తీసుకెళ్లాలనే వివరాలను ఆ టోకెన్లలో సూచించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం తమిళనాడులో 2,19,71,113 బియ్యం కేటగిరీ రేషన్ కార్డుదారులు ఉండగా.. వారందరికీ ఈ కానుకల్ని పంపిణీ చేసేందుకు రూ.2,436.19 కోట్ల మేర ఖర్చవుతుందని అంచనా. అలాగే, 1.77 కోట్ల ధోతీలు, చీరల్ని సైతం పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా నిరుపేద, సామాన్య ప్రజలకు ప్రయోజనం కలగడంతో పాటు రాష్ట్రంలోని చేనేత, పవర్‌లూమ్ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.

# మా ఇద్దరి ఆలోచనలు ఒక్కటే..

### . పవన్‌తో భేటీపై అంబటి రాయుడు



మంగళగిరి: జనవరి 11 (తరణం బ్యూరో)ఇటీవల వైకాపాకు రాజీనామా చేసిన క్రికెటర్ అంబటి రాయుడు బుధవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. సమావేశం వివరాలను ఎక్స్ (ఇంతకు ముందు ట్విటర్) ద్వారా రాయుడు వెల్లడించారు.స్వచ్ఛమైన మనసు, ఆలోచనలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చాను. నా ఆలోచనలు, కలలు సాకారమవుతాయని వైకాపాలో చేరా. క్షేత్రస్థాయిలో అనేక గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నా. వ్యక్తిగతంగా సాధ్యమైనంత మేరకు సాయం చేశా. కొన్ని కారణాల వల్ల వైకాపాతో కలసి ముందుకెళ్తే.. నేను అనుకున్న లక్ష్యాలను సాధించలేనని అర్థమైంది. ఈ విషయంలో ఎవరినీ తప్పుబట్టడం లేదు. నా ఆలోచన, వైకాపా ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. ఎన్నికల్లో ఫలానా స్థానం నుంచి పోటీ చేయాలని అనుకోలేదు. ఇక రాజకీయాలకు దూరంగా ఉండాలనుకున్నా. అయితే.. నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి పవన్ అన్నను కలవమని నా స్నేహితులు, శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. ఆయన సిద్ధాంతాల గురించి తెలుసుకోమన్నారు. అందుకే పవన్‌ను కలసి మాట్లాడా. జీవితం, రాజకీయాలతో పాటు ఆయన్ను అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించా. మా ఇద్దరి ఆలోచనల్లో సారూప్యత కనిపించింది. ఆయన్ను కలిసినందుకు చాలా సంతోషంగా ఉన్నా. ఇంటర్నేషనల్ క్రికెట్ లీగ్ కోసం త్వరలోనే దుబాయ్ వెళ్తున్నా. నేను ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అండగా ఉంటా" అని పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి మంచివి కావు

### నేను ఒకే పార్టీకి కట్టుబడటం వల్లే ఉన్నత స్థానానికి ఎదగగలిగానుపూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

దిల్లీ: జనవరి 11 (తరణం బ్యూరో) నాయకులు తరచూ పార్టీలు ఫిరాయించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారుసిద్ధాంతాలకు కట్టుబడిన రాజకీయాలు ఇప్పుడు దేశానికి అత్యవసరమని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. పుణెలోని ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో బుధవారం జరిగిన 13వ ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం నాయకులు తరచూ పార్టీలు ఫిరాయిస్తున్నారని, ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి ఇది మంచిది కాదని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో ఒక మారుమూల పల్లెకు చెందిన తాను ఉపరాష్ట్రపతి స్థాయి వరకు చేరుకున్నానని చెప్పారు. రాజకీయంగా తాను ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కష్టపడేతత్వంతో పాటు జీవితాంతం ఒకే పార్టీకి కట్టుబడి ఉండటమే కారణమని స్పష్టంచేశారు. అన్ని వేదికలలోనూ చర్చల స్థాయి ఉన్నతంగా ఉండేలా చట్ట సభ్యులు, నాయకులు శ్రద్ధ వహించాలన్నారు. రాజకీయ నాయకులు రాజనీతిజ్ఞుల్లా వ్యవహరించాలని హితవు పలికారు. రాజకీయాల్లోకి యువత, విద్యావంతులు, బాధ్యతాయుతమైన పౌరులు రావాల్సిన అవసరం చాలా ఉందని పేర్కొన్నారు. సమాజాన్ని సత్ప్రవర్తన దిశగా నడిపించే రామాయణం, మహాభారతాలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలని సూచించారు.



# పొడవైన సముద్రవంతెన..

### ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

ముంబయి: జనవరి 11 (తరణం బ్యూరో)భారత్‌లోనే అతిపొడవైన సముద్ర వంతెన అటల్ సేతుని ప్రధాని నరేంద్ర మోదీ రేపు (జనవరి 12)న ప్రారంభించనున్నారు. భారత్‌లోనే అతిపెద్ద సముద్ర వంతెన రవాణా వినియోగానికి అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ వంతెనపై రాకపోకలకు పలు ఆంక్షలు విధించారు. వంతెనపై గరిష్ఠ వేగం గంటకు 100కిలోమీటర్ల దాటకూడదని ఆదేశాలు జారీ చేశారు. మోటార్‌బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లు వంటి వాహనాలుకు అనుమతిని నిరాకరించారు. కార్లు, ట్యాక్సీలు, లైట్ మోటార్ వెహికిల్స్, మిని బస్సులకు మాత్రమే అనుమతి ఉంటుంది. వంతెన ఎక్కేప్పుడు, దిగేప్పుడు వాహనాల వేగం 40 కిలోమీటర్లకు పరిమితం చేశారు. రూ. 18,000 కోట్ల వ్యయంతో నిర్మించిన అటల్ బ్రిడ్జ్.. ముంబైలోని సెవ్రీ నుండి ప్రారంభం అవుతుంది. రాయ్‌గఢ్ జిల్లా ఉరాన్ తాలూకాలోని న్హవా షెవాలో ముగుస్తుంది. అటల్ వంతెన అనేది 6-లేన్ సముద్రం లింక్. ఇది సముద్రం మీద 16.50 కిలోమీటర్లు, భూమిపై 5.5 కి.మీ. ఉంటుంది. ఈ వంతెనతో వాహనదారులు ముంబయి, నవీ ముంబయి మధ్య దూరాన్ని కేవలం 20 నిమిషాల్లో అధిగమించగలరు. ఈ వంతెన లేకపోతే 2 గంటల సమయం పడుతుంది.

# ఢిల్లీలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదు..

ఢిల్లీ : జనవరి 11 (తరణం బ్యూరో)ఢిల్లీలో భూకంపం సంభవించింది. ఆఫ్ఘనిస్తాన్ హిందూకుష్ పర్వత ప్రాంతాల్లో కాబూల్‌కి 241 కిలోమీటర్ల ఈశాన్య ప్రాంతంలో భూకంప కేంద్ర ఉంది రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతో భూకంపం సంభవించింది. దీంతో దేశరాజధాని ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతాల్లో భూప్రకంపనలు వచ్చాయి. ఒక్కసారిగా ప్రజలు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఢిల్లీతో పాటు జమ్మూ కాశ్మీర్, పంజాబ్, ఛండీగఢ్ రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. మన దేశంతో పాటు పాకిస్తాన్ కూడా భూమి కంపించింది. ఇస్లామాబాద్‌తో పాటు పాక్ ఉత్తర భాగంలో ప్రకంపనలు వచ్చాయి.వివరాల ప్రకారం.. జమ్మూ కాశ్మీర్ పూంచ్ జిల్లాలో భూకంపం సంభవించింది. పిర్ పంజల్ ప్రాంతంలోని దక్షిణ ప్రాంతంలో కూడా ప్రకంపనలు సంభవించాయి. పాకిస్తాన్ లాహోర్ నగరం, ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు వచ్చినట్లు అక్కడి మీడియా చెబుతోంది. భూకంపం వల్ల ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదు



12.01_Thur-Tharanam 1-8.qxd 1/11/2024 8:01 PM Page 2



# మర్యాదపూర్వకంగా రామచంద్రయ్యని కలిసిన జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాస రాజు



రాజంపేట. జనవరి. 11 (తరణం ప్రతినిధి)ఉమ్మడి కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు ఎమ్.ఎల్.సి సి.రామచంద్రయ్య ని గురువారం కడప లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే శాలవాతో సన్మానించి వచ్చే ఎన్నికల్లో రాజంపేట నుండి తనకు అవకాశం వస్తే మీ ఆశీస్సులు, సహాయ సహకారాలు మాకు అవసరమని ఆయన కోరారు. సి.రామచంద్రయ్య కూడా సానుకూలంగా స్పందించారన్నారని జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఆయనతోపాటు నందలూరు మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు యల్లటూరు శివరామరాజు, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా యస్.ఐ.ల బదిలీలు

## -వైయస్ సార్ జిల్లా ఎస్.పి. సిద్దార్ధ కౌశల్



కడపజనవరి11 (తరణం క్రైమ్ రిపోర్ట్) వైయస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్ ఐ లను బదిలీచేస్తూ జిల్లా ఎస్ పి సిద్దార్ధ్ కౌశల్ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే సంబంధిత స్టేషన్ లలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు .కడప చిన్నచౌక్ ఎస్ ఐ తులసినాగ ప్రసాద్ రాజుపాలెంకు బదిలీ అయ్యారు. రాజుపాలెం ఎస్ ఐ రాజగోపాల్ కడప విఆర్ కు , గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్ తాళ్ల ప్రొద్దుటూరుకు , తాళ్ల పొద్దుటూరు ఎస్ఐ మోహన్ కడప విఆర్ కు అటాచ్ చేసారు . తొండూరు ఎస్ ఐ హనుమంతు తలమంచి పట్నం ఎస్ఐ గా , తలమంచిపట్నం ఎస్ఐ గోపీనాథ్ రెడ్డి కడప విఆర్ కు అటాచ్ చేసారు .కడప టూ టౌన్ ఎస్ ఐ జయ రాములు బి కోడూరు ఎస్ ఐ గా బదిలీ. బి కోడూరు ఎస్ ఐ వెంకటరమణ కడప విఆర్ కు అటాచ్. కడప విఆర్ లో ఉన్న ఆర్ వి కొండారెడ్డి చాపాడు ఎస్ ఐ గా బదిలీ. చాపాడు ఎస్ ఐ మొయినుద్దీన్ ముద్దనూరు ఎస్ ఐ గా బదిలీ. ముద్దనూరు ఎస్ ఐ చంద్రమోహన్ కడప తాలూకా ఎస్ ఐ గా బదిలీ. కడప తాలుకా ఎస్ ఐ రామకృష్ణ ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐ గా బదిలీ. ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ ఐ సురేష్ మైలవరం ఎస్ ఐ గా బదిలీ. మైలవరం ఎస్ ఐ బివి కృష్ణయ్య కడప వన్ టౌన్ ఎస్ ఐ గా బదిలీ. పులివెందుల ట్రాఫిక్ ఎస్ ఐ హాజీ వలి కడప తాలూకా ఎస్ ఐ బదిలీ. వెంటనే సంబంధిత స్టేషన్లలో రిపోర్ట్ చేసుకోవాలని ఎస్ పి సిద్దార్ధ్ కౌశల్ ఆదేశాలు జారీ చేశారు.

# గూడూరు పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దండి...

## స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనక దేవసేనమ్మ



నెల్లూరు జనవరి 11(తరణం బ్యూరో )సంక్రాంతి పండుగల నేపద్యంలో గూడూరులో పేరుకుపోయిన చెత్తా చెదారాలను మరో రెండు రోజుల్లో తరలించి పరిశుభ్ర గూడూరుకు తీర్చిదిద్దాలని పారిశుద్ధ్య కార్యదర్శులు,కార్మికులకు స్వచ్ఛ ఆంధ్ర సంస్ద చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ సూచించారు.పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు.దీంతో గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు.సిబ్బందికి సూచనలిచ్చారు.ప్రభుత్వం చర్చలు ఫలప్రదం కావడంతో పారిశు ద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు.ఈ నేపద్యంలో గురువారం నుండి కార్మికులు విధులకు హాజరయ్యారు.దీంతో స్వచ్ఛ ఆంధ్ర సంస్ద చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ గురువారం వేకువజామునే పురపాలక కార్యాలయానికి చేరుకున్నారు.పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు.పారిశుద్ధ్య మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు.సిబ్బంది తక్కువగా ఉన్నప్పుడే పట్టణం పరిశుభ్రంగా ఉండేదని గుర్తు చేశారు.సిబ్బంది ఎక్కువ మంది ఉన్నా..కార్యదర్శులు ద్రుష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆమె వారికి సూచించారు.అనంతరం బనిగి సాహెబ్ పేట, సాధుపేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి దేవసేనమ్మ పర్యటించారు. పారిశుద్ధ్య పనులను వారు దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర సంస్ద చైర్ పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ...కార్మికుల సమ్మె కారణంగా గూడూరు అపరిశుభ్రంగా తయారైందన్నారు.కార్మికులు సమ్మె విరమించారని,సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని రెండు రోజుల్లో చెత్తా చెదారాలు తొలగించాలని ఆదేశించామని పేర్కొన్నారు.పరిశుభ్ర గూడూరుకు ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలని ఆమె వివరించారు.ఇంకా మరికొందరు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,పారిశుద్ధ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ హాస్పిటల్ లో 280 మందికి అన్నదానం

## - జే. బి.వి.యస్. ది ప్రిజర్వర్ సేవ సమితి.




కడప, చిన్న చౌక్, జనవరి -11-(తరణం విలేఖరి)-కనీసం పుటినరోజు నాడైనా 10 మందికి అన్నంపెట్టాలని కార్యక్రమ దాతఅయిన హరి అన్నారు. జే.బి.వి.యస్. ది ప్రిజర్వర్ సేవాసమితి ఆధ్వర్యంలో కల్పన పుట్టినరోజు సందర్భంగా స్థానిక రిమ్స్ హాస్పిటల్ లో 280 మందికి అన్నదానం కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మరియు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ అయిన అశోక్ మాట్లాడుతూ సేవాదృక్పథంతో ముందుకెళ్దాం సేవచేద్దామనే నినాదంతో యువత ముందుకువచ్చి తమవంతు సమాజానికి సేవచేయాలని పిలుపునిచ్చారు. సేవ చేయడంవల్ల తమ ఆత్మసమృద్ధి చెందుతుందని, ఇలా మరెన్నో సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని సంస్థసభ్యులైన సిరిచందన మరియు ప్రవళిక తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ కళావతి మాట్లాడుతూ 130కి పైగా అన్నదాన కార్యక్రమాలు, 50కు పైగా జన్మదిన మరియు ఇతరితర వేడుకలు, 650కి పైగా రక్తదానాలు, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్, అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్ట్ ఆలంబన ప్రాజెక్ట్ ఔషధ సమర్పణ, ర్యాలీస్, క్యాంపెయిన్స్ మొదలగు కార్యక్రమాలు సంస్థలో చేయడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థసభ్యులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆయేషా, లక్ష్మీకాంత్, సోహెబ్, సిసింద్రీ, దేవా తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ కు నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి....

## ఆర్ ఆర్ డి ఎస్ డైరెక్టర్ గంగిరెడ్డి..




నెల్లూరు జనవరి 11(తరణం బ్యూరో )తుఫాను కారణంగా నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు చేయూత అందిస్తున్నామని, అధికారులు కూడా స్పందించి గిరిజనులను ఆదుకోవాలని ఆర్.ఆర్.డి.ఎస్ డైరెక్టర్ గంగిరెడ్డి తెలిపారు.సైదాపురం మండలంలోని తోకలపూడి గ్రామానికి చెందిన గిరిజనులకు సంస్ద తరపున దుప్పట్లు, దస్తులు అందజేశారు.

సైదాపురం మండలంలోని తోకలపూడి గ్రామంలోని గిరిజన కుటుంబాలకు ఆర్.ఆర్.డి.ఎస్ తరపున దుప్పట్లు, దుస్తులు అందజేశారు.స్దానిక పాఠశాల వద్ద కుటుంబంలోని భార్యాభర్తలకు వీటిని అందజేశారు.తుఫాను కారణంగా నష్టపోయిన గిరిజనులకు నేటికీ ప్రభుత్వ పరంగా సాయం అందలేదని అక్కడివారు తెలిపారు.దీంతో ఆర్.ఆర్.డి.ఎస్ సంస్ద స్పందించింది.దుస్తులు పంపిణీ చేసిన అనంతరం ఆర్.ఆర్.డి.ఎస్ డైరెక్టర్ గంగిరెడ్డి మాట్లాడుతూ...తుఫాను కారణంగా చాలా కుటుంబాలు నష్టపోయాయన్నారు.ప్రభుత్వ పరంగా అధికారులు సాయం పంపిణీ చేయకపోవడం తమ ద్రుష్టికి రావడంతో సంస్ద తరపున స్పందించి దుప్పట్లు,దుస్తులు అందజేశామని ఆయన వివరించారు.ఇంకా మరికొందరు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సుబ్బయ్య,సంస్ద ప్రతినిధులు మస్తాన్,రాజా,తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ లో చేరిన రైతు నాయకుడు పోరెడ్డి రమణ రెడ్డి .




మదనపల్లె జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ లో గురువారం రైతు నాయకుడు పోరెడ్డి రమణ రెడ్డి చేరడం జరిగింది. స్థానిక మార్పురి వీధి లో అ పార్టీ కార్యాలయం నందు జరిగిన కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ల కార్యదర్శి డి. సత్తార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన పోరెడ్డి రమణ రెడ్డి ని పార్టీ లోకి సాధరంగా ఆహ్వానించారు. అలాగే అయన తో పాటు టి. వెంకటేష్, రియాజ్, ఇర్ఫాన్ బాషా, గణేష్ లు పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్తార్ మాట్లాడుతూ మదనపల్లి డివిజన్ లో సిపిఐ యం ఎల్ లిబరేషన్ పార్టీ ని విస్తరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తంబళ్లపల్లి నియోజకవర్గం లో తమ పార్టీ తరపన అభ్యర్థి ని బరిలో నిలపనున్నామని వెల్లడించారు. అలాగే కార్మికులు, కర్షకులు, రైతులు, రైతు కూలీల సమస్య లు గుర్తించి, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం జగనన్న తోడు...

## చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు...




రాయచోటి జనవరి 11 తరణం ప్రతినిధి జగనన్న తోడుపథకం చిరువ్యాపారుల ఉపాధికి ఊతం కలిగిస్తుందని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో జరిగినజిల్లా స్థాయి జగనన్న తోడు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష లతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరుసగా 8వ విడత జగనన్న తోడు పథకం కింద పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, చిరు వ్యాపారులు ఒక్కొక్కరికి రూ.10,000 అంతకు పైగా రుణాలు. 3,95,000 మంది చిరు వ్యాపారులకు వడ్డీలేని రూ.417.94 కోట్ల కొత్త రుణాలు, మొత్తం 16,73,576 మంది లబ్ధిదారుల్లో ఈ విడత చెల్లించాల్సిన 5.81 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13.64 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌తో కలిపి మొత్తం రూ.431.58 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.ఈ పథకంనకు సంబంధించి ముఖ్యమంత్రి చే జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.లిఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తన 16 నెలల సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు పడుతున్న కష్టాలను చూసి ఇచ్చిన హామీని అమలు చేసి సీఎం జగన్ మాట నిలబెట్టు కున్నారన్నారు.చిరువ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తులవారు రోజు వారీ పెట్టుబడి కోసం ఇక ఎవరినీ ప్రాధేయ పడాల్సిన అవసరం ఉండదన్నారు.అధిక వడ్డీలుకు తెచ్చుకుని అప్పులపాలయ్యే పరిస్థితులు తలెత్తవన్నారు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న రూ 10 వేల రుణాలకు ప్రభుత్వమే వడ్డీలును చెల్లిస్తుందన్నారు.ఈ రుణాలకు ఒక వేళ పొరపాటున ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి పోయిన వారు ఉంటే వసతి దీవెన, వైద్యపు ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు,సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థ, నేడు చిరువ్యాపారులు, తోపుడు బండ్ల, వీధి వ్యాపారులకు జగనన్న తోడు పేరుతో వడ్డీలేని రుణాలను కూడా అందిస్తూజనరంజకంగా పాలన సాగిస్తున్నారన్నారు. కరోనా నేపథ్యంలో 17 సార్లు ఉచిత రేషన్ అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా వున్నా సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వెనుకడుగు వేయలేదన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనసూరీడు ఉదయించక ముందే అవ్వాతాతల ఇళ్ల వద్దకే పెన్షన్లను వాలంటీర్లు అందజేస్తున్నారన్నారు.ఈ నెల నుంచి రూ 3 వేల పెన్షన్ అందించి సీఎం జగన్ మాటనిలబెటుకున్నారన్నారు.నియోజకవర్గ పరిధిలో అర్హులందరికీ 20 వేల పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారుఒక రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోనే 6 వేల మందికి పైగా నారాయణ రెడ్డి పల్లెవద్ద జగనన్న కాలనీ లో ఇళ్ల నిర్మాణాలు జరుగు చున్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పాలనలో 108, 104, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ తదితర ఎన్నో సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని , అదే చంద్రబాబు పాలనలో చెప్పుకోదగ్గ పథకం ఏమైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. పట్టణములో వందపడకల ఆసుపత్రి,ఆర్ టి సి బస్ స్టాండ్ విస్తరణ, మున్సిపల్ సభా భవనం, రైతు బజార్ , డైట్ మున్సిపల్ పార్క్,4 పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు అండగా జగన్ ప్రభుత్వం నిలుస్తోందన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ 18,750/- లును వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా అందిస్తున్నారన్నారు.మెగా చెక్కు అందచేత జగనన్న తోడు పథకం క్రింద రాయచోటి అన్నమయ్య జిల్లాలోని 13,269 లబ్దిదారులకు రూ.1404.00 లక్షలు,మరియు వడ్డీ రాయితీ క్రింద 17,698 మందికి రూ42.43 లక్షలు,మొత్తము కలిపి రూ14,46,42,096 మెగా చెక్కును జేసీ ఫర్మన్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డిఆర్ డి ఏ పిడి సత్యనారాయణ లతో కలసి శ్రీకాంత్ రెడ్డి అందచేశారు. వీధి వ్యాపారులలో హర్షాతిరేకాలుముఖ్యమంత్రి జగన్, ఎంఎల్ఏశ్రీకాంత్, ఎంపీ మిథున్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన జగనన్న తోడు పథక లబ్దిదారులు తమ ఆర్థికాభివృద్ధి కోసం జగనన్న తోడు పథకం ప్రవేశపెట్టి రూ 10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంపై చిరు వ్యాపారులు,వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు మాట్లాడుతూ అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తుంటే తాము సంపాదించింది వడ్డీలకే సరిపోయేదన్నారు. జగనన్న తోడు పథకం తమ జీవితాలను మార్చే పథకమని, తమ మేలు కోసం కృషి చేస్తున్న సీఎం జగనన్న, ఎంఎల్ఏ శ్రీకాంతన్న , ఎంపీ మిథునన్నల మేలు మరువలేమంటూ వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, ఆసిఫ్ అలీఖాన్,మెప్మా అధికారి అబ్బాస్,సిఓ లు రామయ్య,కళ్యాణ్,రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

# జగనన్న తోడు చిరు వ్యాపారులకు వరం లాంటిది

## ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి
## జగనన్నతోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి
## జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్






అన్నమయ్య జనవరి 11( తరణం బ్యూరో)జగనన్న తోడు చిరు వ్యాపారులకు వరం లాంటిదని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగనన్న తోడు 8వ విడతలో చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.... జగనన్న తోడు పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఈ పథకాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు 10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో మహిళల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. ఈ డబ్బును అనవసరమైన అవసరాలకు ఉపయోగించకుండా తీసుకున్న అవసరాలకు మాత్రమే ఖర్చు చేసి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలవడం జరుగుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వం పదికాలాలపాటు ఉండేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ...జగనన్న తోడు పథకం 8వ విడతలో జిల్లాలో మొత్తి 13,269 మంది లబ్ధిదారులకు రూ.1404.00 లక్షలు లబ్ధిదారుల ఖాతాలకు జమ. జిల్లాలో జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన 17,698 మందికి రూ.42.43 లక్షలు వడ్డీ రియంబర్స్మెంట్ కింద జమ చేయడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉ ఒటుందని వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినట్లైతే మళ్ళీ వడ్డీ లేని రుణాలు పొందవచ్చునన్నారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్నతోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, డిఆర్డిఏ పిడి సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు మెగాచెక్కునుఅందజేశారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన పుత్తా చైతన్య.



కమలాపురం, జనవరి 11(తరణం విలేకరి)వల్లూరు మండలం గంగాయపల్లెలో అచ్చింత్రాయపల్లె ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్ ను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తనయుడు యువనాయకుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనఇరుజట్ల ఆటగాళ్ళను పరిచయం చేసుకొని టాస్ వేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో ఆడి స్నేహభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. యువత చదువు, ఉద్యోగాలతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు.

# రెడ్ స్టార్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ




ఒంగోలు జనవరి 11,(తరణం బ్యూరో)సిపిఐ( ఎం.ఎల్ )రెడ్ స్టార్ నూతన సంవత్సర క్యాలెండర్ గురువారం రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులోని మంచి పుస్తకం షాప్ దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్) రెడ్ స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కమ్యూనిస్టు విప్లవకారుల గొంతుక పీడిత ప్రజల పోరాటాల కరదీపిక అయిన రెడ్ స్టార్ పత్రిక ఢిల్లీ కేంద్రంగా నడుస్తూ ఉంది. నూతన సంవత్సర క్యాలెండర్ ను చారిత్రిక పోరాటాల యోధులు ఫోటోలు తేదీలతో క్యాలెండర్ ప్రచురించడం జరిగిందని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ జాతీయోద్యమ వీరులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిస్టు నాయకులు సామాజిక ఉ ద్యమకారులు తేదీలతో ఫోటోలతో రెడ్ స్టార్ క్యాలెండర్ ప్రచురించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ క్యాలెండర్ ను ఉద్యమకారులందరూ తమ దగ్గర ఉంచుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావల్ సుధాకర్ రావు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు తోరటి ఆనంద్ రెడ్ స్టార్ నాయకులు పిన్నికి శ్రీను కే ఎన్ పి ఎస్ జిల్లా కార్యదర్శి ఎం జార్జి బహుజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ఏ సలార్ ఐ ఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం ప్రజాస్వామ్యవాదులు ఆవుల సుబ్రహ్మణ్యం, విశ్వమాన సంక్షేమ సంఘం అధ్యక్షులు కొటారి జనార్ధన్, సాంసన్, వెంకటేశ్వర్లు తదితర సంఘాల నాయకులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడవాలి

## రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి






అన్నమయ్య జనవరి 11 (తరణం బ్యూరో) ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ లు పిలుపునిచ్చారు.గురువారం రాయచోటి జిల్లా కలెక్టరేట్లో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి ఛాయా చిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే, జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జేసీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 19న విజయవాడలో దాదాపు రూ.400 కోట్లతో 20 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతోపాటు 125 అడుగుల డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం ( జన్ బాగీదరి) కార్యక్రమాన్ని, ఛాయా చిత్ర ప్రదర్శన కలెక్టరేట్లో నిర్వహించడం జరిగిందన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప దార్శనికుడని, సామాజిక న్యాయం సాధించడంలో ఆయన మార్గం అనుసరణీయమని తెలిపారు. ఆ మహానేత జీవిత చరిత్ర, ఆయన సమాజానికి చేసిన సేవ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని... ఆయన అడుగుజాడలు అందరికీ ఆదర్శం కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెసి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీవోలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సమాచార శాఖ డిఐపిఆర్ఓ భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ పురుషోత్తం, కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి మనోహర్ రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.శివశంకర్, సి.అంజన్నప్ప, కె.వి.రమణ, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు .

# నగర అభివృద్ధి పనులు వేగవంతం చేయండి...

## సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు ప్రితమ్ రెడ్డి



కడప జనవరి 11 (తరణంవిలేకరి)కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో జరుగుతున్న జాప్యంపై వై.విష్ణు ప్రీతం రెడ్డి, సిటీ కాంగ్రెస్ నాయకులతో కలిసి మాసాపేట సర్కిల్ నుండి మార్కెట్ యార్డు వరకు 26, 29 డివిజన్ల పరిధిలోని ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. వారి పర్యటనలో, కాంగ్రెస్ నాయకులు స్థానిక వ్యాపారవేత్తలతో నిమగ్నమై, సంఘం ఎదుర్కొంటున్న ఆందోళనలు మరియు సవాళ్లను అర్థం చేసుకున్నారు. గత మూడు నెలలుగా డ్రైనేజీ, రోడ్డు పనుల్లో జాప్యం వల్ల రూ.కోట్ల రూపాయల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని వెలుగులోకి వచ్చింది. ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు సంబంధిత అధికారులను కోరారు.........ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, మానవ హక్కుల జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, కార్మిక విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ హబీబ్, ఓబీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోపూరి శ్రీనివాసులు, ఓ బి సి జిల్లా అధ్యక్షులు చిన్న కుల్లాయప్ప, డివిజన్ బాధ్యులు దప్పు చంద్ర, అరుణ్, 42 వార్డు సాదిక్, ఫరీద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శ్యామలాదేవి, 31వ డివిజన్ రఫీ, సిటీ జనరల్ సెక్రెటరీ లోకేశ్వరి వెంకటసుబ్బమ్మ, సులోచన, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ.

## గుంటూరు కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్.



మదనపల్లె జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) : అన్నమయ్య జిల్లా మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం గుంటూరు కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ శాఖ ఏడాది కాలానికి గాను ఈ తరువులు జారీ చేశారు. కొత్త మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీలో గౌరవ చైర్మన్ గా మదనపల్లె ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా, చైర్మన్ గా తట్టి శ్రీనివాసులు రెడ్డి, వైస్ చైర్మన్ గా మన్నవరం రామచంద్ర వెంకటేష్ బాబు, సభ్యులు గా బి.లక్ష్మీదేవి, ఎ.వి.అపర్ణ, సి.సుమ, సి.పి .రమణప్ప,సి.బయన్న, ఎన్.జయమ్మ, బి .శంకర్ నాయక్,మేకల రేణుక, జి. రెడ్డెమ్మ, రెడ్డిపల్లి ఆశా, షేక్ ప్యారేజన్, యస్. మాధవరెడ్డి, తిరుమలరెడ్డి గారి గంగుల్ రెడ్డి, పాక్స్ అధ్యక్షుడు మదనపల్లె, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి అన్నమయ్య జిల్లా, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మదనపల్లె, మున్సిపల్ చైర్ పర్సన్ మదనపల్లె మున్సిపాలిటీ తదితరులు సభ్యులు గా నామినేట్ చేయబడ్డారు. వీరుఏడాది కాలం పాటు పదవిలో కొన సాగనున్నారు. మొత్తం ఇరవై మంది సభ్యులతో కూడిన కమిటీ మదనపల్లి టొమోటో మార్కెట్ యార్డ్ అభివృద్ధి కి గాను సేవలు అందించ నున్నారు.

# 14న జరగాల్సిన బండలాగుడు పోటీలు వాయిదా

## - టిడిపి ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు

ఒంటిమిట్ట జనవరి 11 తరణం విలేఖరి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంటిమిట్ట మండల పరిధిలో సంక్రాంతి సంబరాలు లో భాగంగా జనవరి 14వ తేదీన పారిశ్రామికవేత్త, రాజంపేట తెలుగుదేశం పార్టీ నేత గంట నరహరి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించదల్చారు. తెలుగుదేశం పార్టీ ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు ఒంటిమిట్టలో గురువారం మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలంలో జనవరి 14వ తేదీన దర్జీపల్లి రోడ్డులో నిర్వహించదలచిన బండలాగుడు పోటీలను తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని అన్నారు. జనవరి 14, జనవరి 15 వ తేదీన ఆరు ప్రాంతాలలోనూ, జనవరి 16తేదీ నాలుగో ప్రాంతాలలోనూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా బండలాగుడి పోటీలు నిర్వహించడం జరుగుతున్నాయని అన్నారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ 100000, రూ 70000, రూ 50000 గా భారీ స్థాయిలో బహుమతులు ప్రకటించడం జరిగిందని అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నిచోట్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అనుకున్న స్థాయిలో భారీగా ఎద్దులు రావని ఎద్దుల యజమానుల నుండి అందిన సమాచారం మేరకు తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. త్వరలో తేదీలను ప్రకటించి బండలాగుడు పోటీలను నిర్వహిస్తామని టిడిపి ఒంటిమిట్ట మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు తెలిపారు. ఇందులకు ఎద్దుల యజమానులు, బండలాగుడు పోటీలను వీక్షించే ప్రేక్షకులు, టిడిపి కార్యకర్తలు అభిమానులు సహకరించాలనిఆయన కోరారు.

# నేడు రైల్వే కోడూరులో జయహో బీసీ సమావేశం.

## రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్.



మదనపల్లె జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో జయహో బీసీ సదస్సు విజయవంతంగా ముగిసిందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ మరియు ప్రతి మండల కేంద్రాలలో జయహో బీసీ సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారని, ఇందులో భాగంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రైల్వే కోడూరులో (శుక్రవారం) జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం కురబలకోట మండలం, అంగళ్లులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు టిడిపి ఇంఛార్జ్ కస్తూరి విశ్వనాధ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగు తుందన్నారు. త్వరలో ఏపీలో జరుగబోవు శాసనసభ ఎన్నికల సమరానికి బీసీలను సమాయత్తం చేయాలనే ఉద్దేశ్యంతో నియోజక వర్గాల వారీగా జయహో బీసీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా నేటి నుండి అన్ని నియోజకవర్గాల్లో జయహో బిసి ప్రచార రథాల ద్వారా బీసీలకు అవగాహన కల్పించడానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ముఖ్యంగా బీసీ స్టేట్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తు న్నామన్నారు. కావున రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గం, మండల, గ్రామ కమిటీ విభాగాల సభ్యులు, సాధికార కమిటీ సభ్యులు, బీసీ ముఖ్య నాయకులు, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు

## జిల్లా మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్

అన్నమయ్య జనవరి 11( తరణం బ్యూరో)అన్నమయ్య: జిల్లాలో అర్హులైన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ తెలిపారు.గురువారం రాయచోటి కలెక్టరేట్లోని మిని వీడియో కాన్ఫరెన్స్ హాలులో... ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న హౌస్ సైట్స్ కు సంబంధించి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జి.ఓ.ఎం.ఎస్ నెంబర్ 535 లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి అర్హత ఉన్న జర్నలిస్టులకు హౌసింగ్ సైట్స్ ఇవ్వడానికి కమిటీ అంగీకారం తెలిపిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వులలో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేసిన వారికి హౌస్ సైట్స్ కేటాయిస్తామన్నారు. 5 సంవత్సరాల అక్రిడేషన్ అనుభవం కల్గిన వారిని కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు ఇంటి స్థలాలివ్వడం జరుగుతుందన్నారు.పాత్రికేయుల హౌస్ సైట్స్ కు సంబంధించి నిర్దేశించిన వెబ్ సైట్ లో జనవరి 6 చివరి తేదీలోగా దరఖాస్తు చేసుకున్నవారు... ప్రభుత్వ నిబంధనల ప్రకారం



అవసరమైన డాక్యుమెంట్లతోసహా దరఖాస్తును జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, రాయచోటి కార్యాలయంలో వెంటనే అందజేయాలన్నారు. ఈ సంధర్భంగా ఆయా నియోజకవర్గాల్లో సరైన స్థలం గుర్తించాలని ఆర్డిఓలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సమాచార శాఖ డిఐపిఆర్ఓ భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ పురుషోత్తం, జిల్లా స్థాయి మీడియా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులు బివి నాగిరెడ్డి, బి.సాయి ప్రతాపరెడ్డి, పి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులసమ్మె తాత్కాలిక వాయిదా

## - సిఐ టి యు
## -హామీలు సంతృప్తికరంగా లేవు కామనూరు శ్రీనివాసులురెడ్డి.





కడప, చిన్న చౌక్, జనవరి -11-(తరణం విలేఖరి)-ఈరోజు కడపనగరం పాతబస్టాండ్ వద్ద సిఐటియు జిల్లా కార్యాలయంనందు జరిగిన సదస్సులో జిల్లా సిఐటియు అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ కార్మికులందరూ పూర్తి సంతృప్తిచెందేలా జరగలేదు. ఈ నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని,చర్చల్లో అభ్యంతరాన్ని (డీసెంటు) ఇచ్చామని తెలిపారు. మినిట్స్ కాపీ వచ్చినతరువాత ఒప్పుకున్న జీతభత్యాలు, సమ్మెకాలం జీతం, కేసులఎత్తివేత, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యపరిశీలనకు కమిటీ, క్లాప్ డ్రైవర్ల



సమస్యల పరిష్కారంపై ఉత్తర్వులు రావాల్సి ఉంది. రూ.21 వేల వేతనానికితోడు అదనంగా రెండువేలు లేదా మూడువేలు పెంచాలని, ఒకనెల బోనస్ ఇవ్వాలని ప్రభుత్వానికిలేదని ఆన్నారు. కార్మికులకు 11వ పిఆర్ సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు జీతాలు పెంచి, పిఎఫ్, ఇఎస్ఐఐ సమస్యలు పరిష్కరించాలని కోరామని, సిఆర్డిఎ పరిధిలో మున్సిపాలిటీలో కలిసిన గ్రామాల్లో వారికి మున్సిపల్ వేతనాలు ఇస్తామని మంత్రులు చెప్పారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశామన్నారు.ఇంజనీరింగ్ కార్మికులకు సర్టిఫికెట్ అంగీకరించ లేనివారికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా సర్టిఫికెట్లు, గ్రేడింగ్ ఇప్పిస్తామని మంత్రులు తెలిపారు. దీనిపైనా ఉత్తర్వులు ఇవ్వాలని కోరాము. ఔట్సోర్సింగ్ కార్మికులను కాంట్రాక్టులోకి మార్చేఅంశంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని, ప్రభుత్వాన్ని కోరాల్సినవన్నీ కోరామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంచుపాటి తిరుపాల్, కంచుపాటి శ్రీరామ్, ఇత్తడి ప్రకాష్,సుంకర రవి, సుంకర కిరణ్, కుమార్, శ్రీధర్, బాబు, ఉన్నా బాలాజీ, శివ, జై సింహ, నరసింహులు, ఆసిబాబు, నాగరాజు, ఆదామ్, ధరణి, లక్ష్మి, సాయమ్మ, దస్తగిరమ్మ మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బ్లాక్ మ్యాజిక్ హర్రర్ సినిమా కడప పరిసరా ప్రాంతాల్లో



కడపజనవరి 11(తరణంవిలేకరి) కడప పరిసర ప్రాం తాలలో బ్లాక్ మ్యాజిక్ హర్రర్ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుం టొందని చిత్ర దర్శకులు హబీబ్ షరీఫ్ తెలిపారు. ఈ సినిమాలో స్థానిక కళాకా రులకు పెద్దపీట వేసినట్లు గురువారం ఆయన బ్లాక్ మ్యాజిక్ పోస్టర్ల ఆవి ష్కరణ సందర్భంగా పేర్కొన్నారు.గురువారం నగరంలోని మూవీ టెక్ స్టూ డియోలో పోస్టర్లనుఆవిష్కరించాడు. కడపకు చెందిన మిస్టర్ ప్రసాద్, తిరుపతికి చెందిన ప్రవల్లిక హీరో హీరోయిన్లుగా పూర్తిగా హర్రర్ నేపథ్యంలో సినిమా సాగనుందని దర్శకులు చెప్పారు. చేతబడి కథాంశంతో సినిమాను అన్ని హంగులతో ప్రతి ఒక్కరిని అలరించే విధంగా, భయానకంగా, భయపెట్టే విధంగా చిత్రీకరిస్తున్నామన్నారు. ఈ చిత్రంలో పోస్ట్ ప్రొడక్షన్ కోసం పది టాప్ మోస్ట్ సాఫ్ట్వేర్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కళాకారులనుప్రోత్సహించాలనే ఆశయంతో అవకాశాలు ఇస్తున్నామన్నారు. గతంలో తాను దర్శకత్వం వహించిన 'కథానాయకులు,' సినిమాను జిల్లా ప్రజలు ఆదరించారని, బ్లాక్ మ్యాజిక్ సినిమాను కూడా ఆదరించాలన్నారు. మిస్టర్ ప్రసాద్, రాయుడు లు నిర్మాతలుకాగాస్థానిక కళాకారులు ఆనంద్, పవన్, బాబు, సాయిప్రశాంతి, శివ తదితరులు నటిస్తున్నారన్నారు.

# జగనన్న తోడుతో చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు

## జిల్లాలో 18858 మంది చిరు వ్యాపారులకు రూ. 19.95 కోట్ల జమ
## జడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మ





నెల్లూరు జనవరి 11(తరణం బ్యూరో )నిరుపేదలైన చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా జగనన్న తోడు పథకానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూపకల్పన చేసి, జిల్లాలో 8 విడతల్లో రూ. 165.60 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు.జగనన్న తోడు పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన చిరు వ్యాపారస్తులకు 10 వేల రూపాయల చొప్పున బ్యాంకులు కొత్తగా మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలను, వడ్డీ రీయింబర్స్మెంట్ ను గురువారం ఉదయం తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుండి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డి.ఆర్.డి.ఎ పిడి సాంబశివారెడ్డి, మెప్మా పిడి రవీంద్ర, జగనన్న తోడు లబ్ధిదారులు తదితరులు



పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మీడియాతో మాట్లాడుతూ...ప్రజా సంకల్ప పాదయాత్రలో చిరు వ్యాపారుల కష్టాలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు జగనన్న తోడు పథకం ద్వారా 10వేలు వడ్డీ లేని రుణాలను అందజేసి చిరు వ్యాపారులు, సాంప్రదాయ, హస్త కళాకారులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. దీంతో చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుని ఆనందంగా జీవిస్తున్నారని, పేద బడుగు బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో జగనన్న తోడు పథకం ఎనిమిదో విడత కింద 18858 మంది చిరు వ్యాపారులకు 19.95 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాలకు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. అలాగే వడ్డీ జమ కింద 27636 మంది లబ్ధిదారులకు రూ. 52.86 లక్షలు జమ చేసినట్లు చెప్పారు. నిరుపేదలైన చిరు వ్యాపారులు గతంలో అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, వారి బాధలను గుర్తించిన ముఖ్యమంత్రి వడ్డీ లేకుండా రూ 10,000 రుణాన్ని మంజూరు చేస్తూ, ప్రతి ఏడాది ఈ రుణాన్ని రూ 10 వేల నుంచి 13 వేల వరకు పెంచుకుంటూ పోతున్నట్లు చెప్పారు. చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం చిరు వ్యాపారులు ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో కలిసి మెగా చెక్కులను ఆవిష్కరించారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదు...

## మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్



నెల్లూరు జనవరి 11(తరణం బ్యూరో )వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నీ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటికి పంపుతారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విమర్శించారు.గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గూడూరు పట్టణంలోని గమళ్ళపాళెం ప్రాంతంలో ఏర్పాటై ఉన్న టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ... గత టిడిపి హయాంలో నియోజకవర్గంలో పంబలేరు వంతెన, విద్యానగర్ వరకు నాలుగు రోడ్ల రహదారి వంటి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. వైకాపా వచ్చిన తరువాత ఎలాంటి అభివృద్ధి జరగలేదని, సమస్యల పరిష్కారం కోసం ఉ ద్యోగులు నిరసన బాట పట్టారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటికి పంపుతారని ఆయన వివరించారు.ఇంకా మరికొందరు నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బిల్లు చెంచురామయ్య, రహీమ్, శేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అంగనపూడి సాయిబాబా గుడికి అయోధ్య రాముడి అక్షింతలు

కడప జనవరి 11 (తరణంవిలేకరి)అయోధ్య నుంచి బాబా మందిరానికి వచ్చిన అక్షింతలు అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు భక్తులకు, అయోధ్య రాముని అక్షింతలు ఇవ్వడం జరిగింది. కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రతి ఒక్కరు ఈ నెల 22 వ తారికు అయోధ్య లో రామ మందిర ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆ రోజు ప్రతి ఇంట్లో రామనామం జపిస్తూ పూజలు చెయ్యాలని ప్రపంచానికి హిందువుల ప్రత్యేకత తెలిసే విధంగా ఉండాలని ,సీతా రామచంద్ర మూర్తి కృపకు పాత్రులు అవగలరని కోరారు.ఈ కార్యక్రమంలో కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ, పి రామారావు,పి సత్యనారాయణ,పి గోవిందరావు,పవనకుమార్, టోపి రాజు మహిళా కమిటీ సభ్యులుడి సత్యలక్ష్మి,పి పంకజ,ఎం పద్మ,కన్నమ్మ,సహరపద్మ, గాజుల పద్మ,బి సుజాత, వి లీలావతి పాల్గొన్నారు.



12.01_Thur-Tharanam 1-8.qxd 1/11/2024 8:01 PM Page 5



# మక్తాలో అయోధ్య అక్షితలు ఇంటింటికి పంపిణీ.

.గుండె గణేష్ ముదిరాజ్



శేరిలింగంపల్లి జనవరి 11 (తరణం ప్రతినిధి):శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అయోధ్య రాముని ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా వాడవాడలా అయోధ్య రాముల వారి అక్షింతలు పంచే శుభ తరుణంలో గురువారం మక్త మహబూబ్ పేట్ గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయం నుండి మేళ తాళాలతో అయోధ్య రాముల వారి అక్షింతలు రామసేవకుల భక్త బృందాలు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ మాహత్కార్యంలో ఆలయ కమిటీ వారు, హిందూ బంధువులు, మహిళలు, పిల్లలు, పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఎమ్మెల్యే బొజ్జును కోరిన జాదవ్ రామ్ కిషన్ నాయక్



ఖానాపూర్ జనవరి 11(తరణం బ్యూరో) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ కాంగ్రెస్ నాయకులు జాదవ్ రామ్ కిషన్ నాయక్ ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడమ బొజ్జు మర్యాదపూర్వకంగా కలిశి ఎంపీ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరినట్లు తెలిపారు తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఆరు గ్యారెంటీ స్కీములు విస్తృత ప్రచారం చేసిన జాదవ్ రామ్ కిషన్ నాయక్ శాసనసభ్యులు వెడమ బొజ్జు అభినందించారు రానున్న లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బయోడేటాను ఎమ్మెల్యే కి ఇచ్చి మద్దతు కోరారు దానికి సానుకూలంగా స్పందించి నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మడవి లక్ష్మీకాంత్, దామెర కనకారావు, మహమ్మద్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు



శేరిలింగంపల్లి, జనవరి 11 (తరణం ప్రతినిధి):శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో గల గాంధీ ఎస్టేట్స్ అపార్ట్ మెంట్సు లో మియాపూర్ డివిజన్న పరిధిలో గల న్యూకాలనీలోని మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్నాము. ప్రతి కాలనీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ ఐదు కన్సొలేషన్ ప్రోత్సాహక బహుమతులు అంద జేస్తున్నామని కొమిరిశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం సాయిబాబా, రామస్వామి యాదవులు మాట్లాడుతూ..ఆరోగ్యాన్ని, పారిశుధ్యాన్ని, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయడం అని అన్నారు. ఈ ముగ్గులు అనేక రకాలు. ప్రతిరోజు ఇంటి పరిసరాలను పరిశుభ్ర పరిచి, గోమయంతో కళ్ళాపి చల్లి, బియ్యపు పిండితో రకరకాల రంగవల్లులను కళాత్మకంగా మహిళలు తీర్చిదిద్దుతారు. ముఖ్యంగా ధనుర్మాసంలో ఈ బియ్యపు పిండి తినేందుకు చీమలుచేరి క్రిమి కీటకాలను లోపలికి రాకుండా కాపాడతాయి. అలాగే గోమయం వాసన వలన కూడా విషపూరితమైన కీటకాలు ఇంటి పరిసరాలలోకి రావు. దీని వలన పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా మానవులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం కలుగుతుంది. దీనితోపాటు చూడటానికి ఇంటి ముందు అందంగా కన్పిస్తాయి ముగ్గులు. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలకు జరిగే వ్యాయామం వలన అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నివేదికలు తెలుపుతున్నాయి అన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్ మెంట్ కల్చర్ బాగా పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నాం అని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా తాటిచర్ల వరలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, విజయలక్ష్మి, వరలక్ష్మి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, శిరీష్, ప్రసాద్, మహిళలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలను అధిగమించేందుకే కార్బన్ సర్చింగ్ ప్రోగ్రాం సిఐ

డి మోహన్



ఖానాపూర్ జనవరి 11(తరణం బ్యూరో) నేరాలను అధిగమించేందుకే కార్బన్ సర్చ్ ప్రోగ్రాం లను నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి మోహన్ తెలిపారునిర్మల్ జిల్లా ఎస్పీ ఆదేశము మేరకు కమ్యూనిటి ప్రోగ్రాం లో బాగంగా ఖానాపూర్ పట్టణములోని కరీంకాలనీ ఇంద్ర నగర్ లో గురువారము కార్డన్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్డన్ సెర్చ్ ప్రోగ్రాం లో 52 మోటార్ సైకిల్ లను 4 ఆటో లను స్వాదిన పరుచుకోని, సరైన ధ్రువపత్రములు లేని వాహనములను పెండింగ్ చాలన్ ఉన్న వాహనములకు ఫైన్ విదించడం జరిగిందని సిఐ మోహెన్ అన్నారు ప్రోగ్రాంలో సుమారు 200 మంది ప్రజలు పాల్గొన్నారు.ప్రతి వాహనదారుడు తన వాహనమునకు అన్ని ధ్రువపత్రములు కలిగి ఉండాలని, తమ కాలనీలో అనుమానాస్పద వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదముగా కనపడితే పోలీస్ స్టేషన్లో సమాచార మివ్వాలని సిఐ మోహన్ అన్నారు మైనర్ వ్యక్తులకు వాహనములు నడుపుటకు అనుమతించవద్దని, హెల్మెట్ ధరించాలని, అదేవిధముగా సి సి కెమెరాలను తమ కాలనీలో ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో లో ఖానాపూర్ ఎస్ ఐ జి.లింబాద్రి , కడం ఎస్ ఐరాజు పెంబి ఎస్ ఐ రజనికాంత్ , దస్తూరాబాద్ ఏస్ ఐ ప్రభాకర్ రెడ్డి ఖానాపూర్ పోలీస్ సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పెండింగ్ చాలాన్లకు గడువు పెరిగిందని వెంటనే వాటిని చెల్లించి డిస్కౌంట్ సద్వినియోగం చేసుకోవాలని సిఐడి మోహన్ కోరారు

# ఐఏఎస్ అమిగోస్ అకాడమీ డైరీ ఆవిష్కరణలో జాన్సన్ నాయక్



ఖానాపూర్ జనవరి 11(తరణం బ్యూరో)అమిగోస్ ఐ ఎ ఎస్ అకాడమీ డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ చేతుల మీదుగా జరగింది సందర్భంగా పాల్గొన్న భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతు నేటి సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలంటే చదువే పునాది అని. సివిల్స్ ఉద్యోగమే లక్ష్యంగా విద్యార్థులు చదివి ఉజ్వల భవిష్యత్తును ఏర్పరచుకోవాలని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్న పేద విద్యార్థులకు ఈ అకాడమీలో సివిల్స్ గ్రూప్ 1, గ్రూప్ 2 లలో ఆసక్తి ఉన్నవారికి కోచింగ్ తీసుకోవడానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ ముస్కు రమణ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి జెడ్ సి గా బాధ్యతలు చేపట్టిన..స్నేహ శబరిష్



శేరిలింగంపల్లి, జనవరి 11 (తరణం ప్రతినిధి):శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ గా స్నేహ శబరిష్ ఐఏఎస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఎస్.పద్మిని ప్రియదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సత్యరెడ్డి, కె.ప్రతాప్ రెడ్డి, తన్వీర్ బేగం, చందానగర్ డివిజన్ అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించాలని ఆందోళన చేసిన..శివసాయి బృందం



పఠాన్ చేరు, జనవరి 11 (తరణం ప్రతినిధి):పఠాన్ చేరు నియోజకవర్గంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు కావొస్తున్న ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని బీసీ కాలనీ ప్రజలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెట్లింగ్ శివసాయి కి తమ సమస్యలను తెలియచేసారు. బీసీ కాలనీకి ఇప్పటి వరకు డ్రైనేజీ, రోడ్డు, విధి దీపాలు, తాగడానికి మంచి నీరు సౌలభ్యం లేదు అని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శివసాయి మాట్లాడుతూ..మున్సిపల్ అధికారులు పన్నులు వసూలు చేస్తారు, కాలనీ అభివృద్ధి పట్టించుకోర అని ప్రేశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ గత పది సంవత్సరాల నుండి అధికారంలో ఉండి బీసీ కాలనీ అభివృద్ధి చెందలేదని, బిఆర్ఎస్ నాయకులు కాలనీ కృషి కోసం ఎలాంటి చెర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీసీ కాలనీ ప్రజలకు డ్రైనేజీ, రోడ్లు, తాగడానికి మంచి నీరు, విధి దీపాలను ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో బస్తి వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అధికారికంగా ఒడ్డే ఓబన్న జయంతి



నిర్మల్ జనవరి 11(తరణం బ్యూరో)ఒడ్డెరా కుల ఆరాధ్య దైవం అయిన ఒడ్డె ఓబన్న జయంతి ని పురస్కరించుకొని గురువారం నిర్మల్ జిల్లాకలెక్టరేట్ లోని మినీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఒడ్డె ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్ లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ లు జ్యోతి ప్రజ్వలన గావించి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ ఓబన్న 208 వ జయంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడం జరిగిందని , ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటం లో ఒడ్డె ఒబన్న సైన్యాధ్యక్షుడు గా పని చేశారని, సంచార జాతి లో పుట్టి న ఒబాన్న సేవలు మరువలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వర్ గౌడ్, జిల్లా అధికారులు, ఒడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, వేముల గురువయ్య, మక్కల గంగాధర్, నర్సయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# మక్క కంకి కొనుక్కని తిన్న మంత్రి సీతక్క ఎమ్మెల్యే బొజ్జు



ఖానాపూర్ జనవరి 11(తరణం బ్యూరో) సామాన్య వ్యక్తిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క పర్యటన భాగంగా మార్గమధ్యలో మక్కా కంకి కొనుక్కొని తిన్నారు బుధవారం ఖానాపూర్ నియోజకవర్గం లో పర్యటన నిమిత్తం ఎమ్మెల్యే బొజ్జుపటేల్తో పలు కార్యక్రమాల్లో పాల్గొని జైనూర్ వెళ్ళేమార్గంలో ఉడుంపూర్ వద్ద సాయంత్రం మక్క కంకులు కాల్చి అమ్ముతున్న చోటా కారు ఆపి ముసలమ్మతో ముచ్చట పెడుతూ బేరమాడి మక్క బుట్టలు కొనుక్కొని తియ్యగా ఉన్నాయంటూ తిన్నారు ఇందులో బొజ్జుపాటేలు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సత్తు మల్లేష్ లు ఉన్నారు మంత్రి ,ఎమ్మెల్యేలు మక్కా బుట్టలు కొనుక్కొని తినడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు

# జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

-జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు

-అన్ని జిల్లాల కలెక్టర్లతో విసి ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి



కడప, జనవరి 11 (తరణంబ్యూరో): జిల్లాలో అన్నిరకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, అన్ని రకాల సంక్షేమ పథకాల అమలు తీరుపై.. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు, నగర కమీషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబందిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడి, వైయస్సార్ క్లినిక్ లు, తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టిని సారించి వెంటనే పనులు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నాడు- నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరుగా తీసుకెళ్లేందుకు ఆయా శాఖల ద్వారా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి, సీపీవో వెంకట్రావు, ఐసీడీఎస్, హౌసింగ్,ఎస్ ఎస్ ఏ పీవో శ్రీలక్ష్మి, కృష్ణయ్య, అంబవరం ప్రభాకర్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కోటి 30 లక్షల రూపాయల వ్యయం తో సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువలు..

## మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



నెల్లూరు జనవరి 11(తరణం బ్యూరో )సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామాలను సమగ్రంగా, సంపూర్ణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.వెంకటచాలం మండలం లోని నాయుడుపాలెం,రామదాసు కండ్రిగ గ్రామాల్లో కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో వివిధ సిమెంట్ రోడ్లను, సైడ్ డ్రైన్లు ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా రామదాసు కండ్రిగ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ...ఈ ఒక్క పంచాయతీకి సంబంధించి సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువలతో పాటు నాడు నేడు పాఠశాలల అభివృధి పనులు, అంగన్వాడి భవనలు ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలను 6 కోట్ల 25 లక్షల రూపాయలు నిధులు ఖర్చు చేసి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ గ్రామానికి ప్రధాన సమస్యలైనా సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువలను నిర్మించడంతోపాటు త్రాగునీరు అందించే లక్ష్యంగా ప్రతి ఇంటికి కొళాయిని ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తున్నదని, ఫిబ్రవరి కల్లా అన్ని ఇళ్లకు సమగ్రంగా త్రాగునీరు అందించే కార్యక్రమం పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. ఈ గ్రామానికి సాగునీరు అందించేందుకు వీలుగా ఉన్నత అధికారులతో చర్చించి కనుపూరు కాలువ నుంచి తాత్కాలిక ప్రాతిపదికన కాలువ నీరు అందించామని, తదుపరి శాశ్వత ప్రాతిపదికన సాగు నీరు అందించే విధంగా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పేదవారికి భూముల పట్టాలు అందజేయాలన్న లక్ష్యంతో వివిధ భూ సమస్యలను పరిష్కరించుతూ భూములను నోషనల్ ఖాతాల్లో నుంచి తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా చుక్కల భూములు సమస్యలను పరిష్కరించి, 20 సంవత్సరములు నుండి హక్కులు అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించడంతోపాటు, ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఇళ్ళ.పట్టాలు మంజూరు చేశామన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో దాదాపుగా 5,445 కుటుంబాలకు 6,610 ఎకరాలు భూమిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం గడప గడపకు కార్యక్రమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సఫలీకృతం అయిందన్నారు. సంఘ బంధాల వారికి గత ప్రభుత్వం రుణ మాఫీలను చేయలేదని, వాటిని నాలుగు విడతల్లో చెల్లించే విధంగా ప్రభుత్వం చేపట్టిందని, 45 సంవత్సరముల నుంచి 60 సంవత్సర వయసున్న వారికి 4 విడతల్లో వారి ఖాతాలలో జమ చేస్తామని చెప్పి, మూడు విడతల్లో వారి ఖాతాలో జమ చేశామని ఫిబ్రవరి 5వ తారీఖున నాలుగో విడతగా వారి ఖాతాలో 18,750 రు. జమ చేయడం జరుగుతుందని తెల్పారు. అమ్మఒడి, రైతు భరోసా, వైయస్సార్ చేయూత ,కాపు నేస్తం, నేతన్న నేస్తం , మత్స్యకార భరోసా ,ఆటో డ్రైవర్ల ఖాతాల్లో 10,000 రూ.వంతున జమ చేయటం, అనేక పథకాల అమలు, ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ ముందుకు వెళుతుందన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రభుత్వం కరోనా బారిన పడిన వారికి 15,000 రూపాయలు, వారి ఖాతాలో జమ చేసిందన్నారు. పేదవాడి అభ్యున్నతికి అన్ని విధాల కృషి చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు రాష్ట్ర మంత్రి గా, సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యునిగా, మీ ఇంటి బిడ్డగా, పేదలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాల అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.కె ముజీబున్నిసా, ఎం.ఈ.ఓ. కె . మధుసూదన్, హౌసింగ్ ఏ.ఈ. గౌస్ మొహద్దీన్ ,ఏ పీ.వో. సురేంద్ర, ఏ.పీ.ఎం. సుమతి ,గ్రామ సర్పంచ్ నాజుని, వైసీపీ సీనియర్ నాయకులు షాజహాన్, వెంకట శేషయ్య ,చెంచయ్య, కోడూరు ప్రదీప్ రెడ్డి, కోదండరామిరెడ్డి , మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు.

## బహుమతుల ప్రధానోత్సవానికి హాజరైన ఆర్.జె.వెంకటేష్.



మదనపల్లె జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో రాజంపేట పట్టణం, కూచివారిపల్లి నందు గురువారం యువతులు, మహిళకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచినవారికి చమర్తి జగన్మోహన్ రాజుతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కుసుమ కుమారి సుబ్రహ్మణ్యం నాయుడులు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వదినాలు భారతీయ సంస్కృతికి అద్దం పడుతాయని, మన పూర్వీకులు అందించిన ఆచార సంప్రదాయాలను మనం కొనసాగించా లన్నారు. అన్ని మతాల వారు పర్వదినాలను కలిసికట్టుగా చేసుకోవడం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమన్నారు. భారతదేశ గొప్ప లౌకికవాద దేశమని కొనియాడారు. ఈ ముగ్గుల పోటీల్లో యువతులు, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని వారు కితాబునిచ్చారు.

# ఎ పి భూ యాజమాన్యహక్కు చట్టాన్ని రద్దుచేయాలి



కడప, చిన్న చౌక్, జనవరి-11-(తరణం విలేఖరి)-ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్యహక్కు చట్టం 2022 ను వెంటనే రద్దుచేయాలని కడప జిల్లాకోర్టు ఎదుట న్యాయవాదులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. న్యాయవాది కర్నాటి భువన ఏకాదశిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులతోపాటు పలువురు న్యాయ విద్యార్థులుసైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి భువన ఏకాదశ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రజల భూములపై యాజమాన్య హక్కులకు సంబంధించి ఒక ప్రత్యేకచట్టం తీసుకువచ్చిందని, ఈ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, భూ వివాదాలకు సంబంధించి ఈ చట్టం న్యాయ వ్యవస్థయొక్క పరిధిని మరియు అధికారాలను దూరంచేస్తుందని, తీర్పులిచ్చే అధికారాన్ని కోర్టులనుండి ప్రభుత్వ అధికారులచేతుల్లోకి తీసుకువెళ్తుందని, తత్ఫలితంగా భూఆక్రమణదారులకు, రాజకీయ నాయకులకు మరియు బడాబాబులకు ఈ చట్టం ఒక ఆయుధంగా తయారవుతుందని, బలవంతులదే భూమిఅన్నట్లుగా భూదందాలు, భూ ఆక్రమణలు, భూ కబ్జాలు ఎక్కువ అవుతాయని ఆయన అన్నారు. ఈ చట్టం అమలులోకివస్తే ముఖ్యంగా పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు కబ్జాదారులకోరల్లో ఇరుక్కుపోతారని, తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దుచేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. శుక్రవారం కడపజిల్లాలోని పలున్యాయస్థానాల పరిధిలోఉన్న న్యాయవాదులు అందరూ కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి కలెక్టరేట్ బంగ్లావరకు పెద్దఎత్తున ర్యాలీ కార్యక్రమం నిర్వహించి, చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామకొండయ్య, ఏపీ న్యాయవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగనమల సుమన్, రాంప్రసాద్ రెడ్డి, పి.యస్. బాలసుబ్రమణ్యం, సంపత్ కుమార్, గుర్రప్ప, ధీరజ్, వి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జనసేన పార్టీ ఆధ్వర్యంలోని యోజకవర్గ స్థాయిలోముగ్గుల పోటీలు

## రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతి కారి కృష్ణ



సిద్దవటం జనవరి 11(తరణం విలేఖరి) నేడు నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు అతికారి కృష్ణ తెలిపారు మండల కేంద్రమైన సిద్దవటం లో కృష్ణ మాట్లాడుతూ తన తల్లి అతికారి రోశమ్మ జ్ఞాపకార్థం అతికారి కృష్ణ అతికారి దినేష్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో సిద్దవటం ఒంటిమిట్ట, మండలాల్లో మహిళలకు ముగ్గులు పోటీలు జరుగుతాయని ఆయన ఒక ప్రకటన తెలియజేశారు గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 20 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10,000 అందజేయడం జరుగుతుందన్నారు జనసేన పార్టీ తరపున రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు

# తెలుగుదేశం "రా కదలిరా" సభలకు వెల్లువెత్తిన జనాబా

## రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమే
## టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల



రాజంపేట. జనవరి. 11 (తరణం ప్రతినిధి)వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్యాయాలను,అక్రమాలను ఎత్తిచూపేందుకు తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల అచంట, ఆళ్లగడ్డ, తుని, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ నాయకులు సమన్వయంతో నిర్వహించిన "రా కదలిరా" బహిరంగ సభలకు జనాలు తండోపతండాలుగా తరలివచ్చి విజయవంతం చేస్తున్నారని, వెల్లువెత్తిన జనవాహితో తెలుగుదేశం పార్టీ రెట్టింపు ఉత్సాహంతో దూసుకుని పోతుందని ఈ ఆదరణను చూసి వైసిపి నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు తెలిపారు.గురువారం రాజంపేట పట్టణంలోని బత్యాల భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయేది తెలుగుదేశం,జనసేన ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామని జోష్యం చెప్పారు.జిల్లా ప్రజల స్పందన జోరుకు వైసిపి ప్రభుత్వం పతనం ఖాయమని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు లేవని దీంతో యువత నిరుద్యోగులుగా మిగిలారని చెప్పారు. వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి తన అనుచరులతో మాఫియాను ఏర్పాటు చేసుకొని ల్యాండ్,శాండ్,వైను,మైను దోపిడీలతో లక్షల కోట్లు దోపిడీ చేసి రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆరోపించారు.అదేవిధంగా రంగుల పిచ్చోడు, బొమ్మల పిచ్చోడు అనే నినాదంతో బాత్రూంల పైన, సర్వే రాళ్లపైన ,రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల పైన, విద్యార్థుల పుస్తకాల పైన, విద్యార్థులు తినే ప్లేట్ల పైన అతని బొమ్మను వేసుకుంటూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడని విమర్శించారు.భూమి రైతులది అయితే ఆ భూమి పత్రాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మ ఎందుకని ప్రశ్నించారు. అదేవిధంగా భూముల రికార్డును తారుమారు చేసి వాటిని అమ్ముకునేందుకు వైకాపా ప్రభుత్వం పెద్ద కుట్ర చేసిందని ఆరోపించారు.ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి పాలనను ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించి తెలుగుదేశం ప్రవేశ పెట్టిన పథకాలను అన్నింటిని రద్దుచేసి ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు.రాబోయే ఎన్నికల్లో కూడా జగన్మోహన్ రెడ్డి,చెల్లెలు,తల్లి కూడా వచ్చి మాకు కూడా ఒక ఛాన్స్ ఇవ్వండి అని అడగవచ్చునని తెలిపారు. కానీ ప్రజలందరూ ఆలోచించి వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేట టీ డీ పీ పార్లమెంట్ అభ్యర్థి బాలసుబ్రహ్మణ్యం ను కలిసిన జనసేన నాయకులు



అన్నమయ్య జనవరి 11 (తరణం బ్యూరో)అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోనిటిడిపి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం గారి కార్యాలయంలో జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారుత్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు.అదేవిధంగా భవిష్యత్తుకు గ్యారెంటీ నారా చంద్రబాబు నాయుడే నన్న నినాదం ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. సామాన్యుల నడ్డీ విరచిన వై సిపి ప్రభుత్వం విధానాల ను ప్రజల కు వివరించాలన్నారు.జనసేన, టిడిపి నాయకులకు కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధి కి పాటుపడే విదంగాఉమ్మడి నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, రాజంపేట పార్లమెంటుజనసేన నాయకులు శ్రీనివాస్,మదనపల్లి జనసేన నాయకులు రామాంజనేయులు,కాపు సంక్షేమ నాయకులు శరత్ బాబు, రమణ తదితరులు పాల్గొన్నారు

# అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



రాజంపేట. జనవరి. 11 (తరణం ప్రతినిధి)రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని విద్యార్థులు మరియు అధ్యాపక బృందం ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. పాల్గొన్న వారందరూ సంక్రాంతి ముగ్గులు చేసిన, కళాఖండాలు పొంగల్ సంబరాలు మొదలగు ఉల్లాస కార్యక్రమాలు నిర్వహించారు.కళాశాలకు విద్యార్థిని విద్యార్థినిలు సంప్రదాయ దుస్తులను ధరించి, మన దేశ సంప్రదాయాన్ని గుర్తు తెచ్చుకున్నట్టు అందరిని ఆకర్షించడం జరిగింది. ముగ్గుల పోటీలలో కనబరిచిన విద్యార్థినిలకు కళాశాల యాజమాన్యం వైస్ చైర్మన్ సి. ఎల్లారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సి. అభిషేక్ రెడ్డి, చైర్మన్ రామచంద్ర రెడ్డి లు పాల్గొన్నారు.

# బాబు షురిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ రచ్చబండ.

### పాల్గొన్న ఇంచార్జి దొమ్మలపాటి రమేష్.



మదనపల్లె జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మదనపల్లి పట్టణం 16 మరియు 17 వార్డుల నందు టిడిపి ఆధ్వర్యంలో బాబు షురిటి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటి నమోదు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి మదనపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి దొమ్మలపాటి రమేష్, నియోజకవర్గ పరిశీలకులు చలపతి నాయుడు లు పాల్గొని తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరచటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీలను ఇచ్చి అమలు చేయడం విస్మరించారని ధ్వజమెత్తారు. అన్ని ధరలను పెంచి ప్రజలకు శిరోభారంగా మార్చారని రానున్న ఎన్నికల్లో టిడిపికి అండగా నిలిచి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేస్తే ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మదనపల్లి పట్టణ అధ్యక్షులు జోలేపాలెం భవాని ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకట రమణా రెడ్డి, మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జి సోమశేఖర్, యునిట్ ఇంచార్జి రఘునాథ్ నాయుడు, హరిప్రసాద్, మహిళ నాయకురాలు మైథిలి మరియు వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్నంభోజనం కార్మికులకు కనీసవేతనాలు చెల్లించి, మెస్ ఛార్జీలు పెంచాలి

### -ఎ ఐ టి యు సి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ . నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.వేణుగపాల్ ల డిమాండ్.




కడప, చిన్న చౌక్, జనవరి -11-(తరణం విలేఖరి)-ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజనపథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడపజిల్లా సమితి పిలుపులో భాగంగా గురువారం కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ కడపజిల్లా ప్రధానకార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్ లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలనుండి ప్రభుత్వ పాఠశాలలో వంటఏజెన్సీలను నడుపుచున్నారని వీరికి ఇప్పటికీ సరైన గుర్తింపులేదని, ఇప్పటివరకు పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ ఛార్జీలు పెంచలేదు. చాలీచాలని మెస్చార్జిలతో ఏజెన్సీలను నడపలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతసంవత్సరం జూలై నుండి ఇప్పటివరకు మూడుసార్లు మెనూను రాష్ట్రప్రభుత్వం మారుస్తూఉందన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో ఎప్పటికప్పుడు కొత్తమెనూ రాష్ట్రప్రభుత్వం అమలు చేయడంవల్ల మధ్యాహ్నం కార్మికులమీద విపరీతమైన భారంపడుతున్నదని, మరికొన్నిచోట్ల తీవ్రమైన రాజకీయ ఒత్తిడిలకు గురిచేస్తూ తొలగింపునకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం రాగిజావ ప్రవేశపెడుతుందని, పెట్టడం మంచిదే కానీ దీనికిఅనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి. దీనివల్ల కార్మికులపై అధికభారం పడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మెనూప్రకారం ప్రతివిద్యార్థికి 30/- రూ మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీసవేతనం 10,000/- రూపాయలు జీతంపెంచాలని, సబ్సిడీకింద గ్యాస్ ప్రభుత్వమే ఏజెన్సీలకు సరఫరా చేయాలని, నాడు-నేడు రెండో విడత వంటశాలలు నిర్మించి ఇవ్వాలని, వంట సామాగ్రిని ప్రభుత్వం వెంటనే సరఫరాచేయాలని వారు కోరారు. కార్మికులకు ఎటువంటి భద్రతా లేనికారణంగా వీళ్లకి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గత నాలుగు నెలలనుండి పెండింగ్లోఉన్న జీతాలు, మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉద్దె మద్దిలేటి,ఏపీ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా గౌరవ అధ్యక్షుడు చాంద్ బాషా, జిల్లా ప్రధానకార్యదర్శి సులోచనమ్మ, జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేరీ, జిల్లా డిప్యూటీ సెక్రటరీ వి.మోహన్, కార్మికులు శంకరన్న, గురుదేవి, వెంకటలక్ష్మి, వెంకటసుబ్బయ్య, రియాజ్, లక్ష్మీపార్వతి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్న

### పూడికల తొలగింపు పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే వాసుపల్లి



(విశాఖపట్నం.జనవరి11, తరణం ప్రతినిధి)రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ పారిశుధ్య కార్మికుల సమస్యల అర్థం చేసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీతాలు పెంచి సంక్రాంతి పండుగను ముందే తెచ్చారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు.దక్షిణ నియోజకవర్గం 38వ వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు.రోడ్లు కాలువలు పొంగిపొర్లుతున్నాయని దీంతో ప్రజల నుండి వస్తున్న వివిధ ఫిర్యాదులు మేరకు పరిసర ప్రాంతాలను వెంటనే శుభ్రపరచాలని కోరారు. ఎప్పుడు కార్మికుల పట్ల అండగా ఉంటామని జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతాదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు.పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిష్కరించి వారి జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు.

# అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ముద్రించటం అభినందనీయం

### -ఆప్ కి ఆవాజ్ ఉర్దూ క్యాలెండర్ ఆవిష్కరించిన ఫాతిమా మెడికల్ కాలేజ్ సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ఎ క్యు జవ్వద్.



కడప, చిన్న చౌక్ , జనవరి-11-(తరణం విలేఖరి)-ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ 2024 నూతన సంవత్సరం సందర్భంగా ముద్రించినటువంటి ఉర్దూ క్యాలెండర్ ను స్థానిక ఫాతిమా మెడికల్ కాలేజీలో గురువారం ఫాతిమా మెడికల్ కాలేజీ సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ఎ క్యు జవ్వద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవ్వద్ మాట్లాడుతూ ఆప్ కి ఆవాజ్ క్యాలెండర్ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ముద్రించటం ఒకపక్క హిందువులకు, ఒకపక్క ముస్లింలకు అనుకూలమైనటువంటి క్యాలెండర్ అని ఆయన అన్నారు. ఏదో ఒక ముస్లిం మైనార్టీల సమస్య పైన వారి జీవన స్థితిగతులపైన ప్రభుత్వం ఇచ్చిన హామీలకోసం అన్నివర్గాల ప్రజలను చైతన్యంపరుస్తూ ఆప్ కి ఆవాజ్ అనేకమిటీ మంచి ఆలోచనలతో ముందుకు పోతున్నదని ఆయన అన్నారు. నేడు ప్రత్యేకించి ముస్లింల సమస్యలు గాలికి వదిలేసినటువంటి ముస్లింపెద్దలకు కళ్ళు తెరిపించేవిధంగా లోతుగా అధ్యయనంచేసి ముస్లింలకు రావాల్సిన హక్కులు, వారి ఆస్తులను కాపాడుకోవడంకోసం పోరాటంచేస్తూ ముందుకు వెళుతున్నదని ఆయన అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలకు అధికారంలో ప్రభుత్వాలు మోసంచేస్తున్నాయని, ఇలాంటి మోసాలను ప్రజలదృష్టికి తీసుకునిపోయి మేలుకొలిపే విధంగా ఆప్ కి ఆవాజ్ పనిచేస్తున్నదని, ఆకమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆరిఫ్ ఖాన్, మక్బూల్ భాషాలు మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలను చైతన్యం పరచడం కోసమే ఆప్ కి ఆవాజ్ స్థాపించటం జరిగిందని వారన్నారు. నేడు చాలామంది ముస్లింవిద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ప్రభుత్వం ఉచితవిద్యను ప్రోత్సహించటంలేదని వారన్నారు. సచార్ కమిటీ రంగనాథ్ రిపోర్టుల ఆధారంగా సామాజికంగా, ఆర్థికంగా విద్య, ఉద్యోగ, ఉపాధిపరంగా నేటివరకు దళితులకంటే హీనమైన జీవనం గడుపుతున్నారని వీరికోసం ప్రత్యేకనిధులు కేటాయించి సబ్ ప్లాన్ రూపొందించి వారివారి నివాస ప్రాంతాల్లో కేటాయించాలని రిపోర్టులు ఆధారాలతో చూపించిన మన పాలకనాయకులు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ముస్లింలకు చైతన్యం పరచడంకోసం కలిసొచ్చే సంఘాలతో కలుపుకొని పోరాటాలకు సిద్ధమవుతామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ నాయకుడు నబీ భాష, యాసీన్ ఫాతిమా మెడికల్ కాలేజీ సిబ్బంది రామ కృష్ణ, సోమేష్, సుదర్శన్ రెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు ప్రత్యేక పాఠశాల మరియు వృద్ధాశ్రమాన్ని వైయస్సార్సీపి అభ్యర్థి నిస్సార్ అహ్మద్ సందర్శన.




మదనపల్లి జనవరి 11, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మదనపల్లె మండం, కోళ్ళబైలు పంచాయతీ, అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు ప్రత్యేక పాఠశాల మరియు వృద్ధాశ్రమాన్ని మదనపల్లె వైయస్సార్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ లో వున్న మదనపల్లె వాస్తవ్యులు నిస్సార్ అహ్మద్ విచ్చేయగా వెలుగు చిన్నారులు మరియు వృద్దులు పుష్పాలతో స్వాగతం పలికారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి , వెలుగు వృద్ధాశ్రమం సూపరింటెండెంట్ ఎం.ఉదయ్ కుమార్ రెడ్డి పుష్పగుచ్ఛముతో స్వాగతం పలికారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులందరిని అయన ప్రేమతో పలకరించారు. వెలుగు సంస్థ మంచి కార్యక్రమాలను చేస్తున్నందుకు వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి సేవలను అభినందించారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి వెలుగు సంస్థ యొక్క కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం సోషల్ వర్కర్ ఎం. గీత మాట్లాడుతూ నిస్సార్ అహ్మద్ మితభాషి , మృదు స్వభావం మరియు సేవ భావం కలిగిన వ్యక్తి అని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరిని కలుపుకొని ప్రజలకు సేవ చేసే వ్యక్తిత్వం ఉన్నవారన్నారు. పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ లో డి.ఈ గా చాల కాలంగా పనిచేసి ఈ మధ్యనే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారని తెలిపారు. వీరికి మదనపల్లె మరియు పరిసర మండలాల రైతులతో, కాంట్రాక్టులతో మంచి సత్సంబంధాలు కలిగిన వ్యక్తి అని గత నలభై సంవత్సరాలుగా వెలుగు సెక్రటరీ ఎం ఉదయ్ మోహన్ రెడ్డి కి మంచి సన్నిహితుడని తెలిపారు. వీరి తండ్రి ప్యారిజాన్ మరియు ఉదయ్ మోహన్ రెడ్డి తండ్రి వెంకటరమణ రెడ్డి తో మంచి సంబంధము కలిగి ఉన్నారని , ప్యారిజాన్ కూడా కులమతాలకు అతీతంగా అందరితోను మంచిగా ఉండేవారని , ఎవ్వరితోను ఎటువంటి విభేదాలు లేకుండా ఉన్న కుటుంబం అని, ఇలాంటి కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన నిస్సార్ అహ్మద్ త్వరలో జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేయుచున్న సందర్భంగా వెలుగు సంస్థ తరపున హార్దిక శుభాకాంక్షలు తెలిపారు . ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని , మున్ముందు గొప్ప గొప్ప పదవులను అధిరోహించాలని వెలుగు సంస్థ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వృద్దులకు దుప్పట్లు మరియు స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వెలుగు ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, వైసిపి నాయకులు , వెలుగు కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి , వైసిపి నాయకులు , వెలుగు సిబ్బంది , చిన్నారులు, వృద్దులు పాల్గొన్నారు

# ముందే వచ్చిన సంక్రాంతి వేడుక

### విశాలాంధ్ర, చమర్తి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

### పోటీలకు అనూహ్య స్పందన



రాజంపేట.జనవరి.11 (తరణం ప్రతినిధి)రెండు రోజుల ముందే సంక్రాంతి పండుగ వచ్చిందా అన్నట్లు విశాలాంధ్ర దినపత్రిక టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు సహకారంతో మండల వ్యాప్తంగా 23 పంచాయితీలలో నిర్వహించిన ముగ్గుల పోటీలు పల్లెల్లో సంక్రాంతి శోభను రెండు రోజులు ముందే తీసుకొచ్చింది. ఈ పోటీలకు అన్ని గ్రామపంచాయతీలలోనూ పెద్ద ఎత్తున మహిళలు పోటా పోటీగా పాల్గొన్నారు. ఈ పోటీలకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల నుంచి అనూహ్య స్పందన రావడంతో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని తమ లోని ప్రతిభను వెలికితీస్తూ రంగురంగుల ముగ్గులను ముచ్చటగా ప్రదర్శించారు. ప్రతి గ్రామ పంచాయితీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ 3116, ద్వితీయ బహుమతి రూ 2116, తృతీయ బహుమతి రూ 1116 లు అందజేశారు. గ్రామపంచాయతీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి పొందిన మహిళలు 12వ తేదీన టిడిపి పార్లమెంట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మండల స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. రాజు విద్యాసంస్థల సిబ్బంది, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్ రాజు అందించిన సహకారానికి విశాలాంధ్ర దినపత్రిక యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.సంస్కృతి-సంప్రదాయాలను పరిరక్షించేందుకే ముగ్గుల పోటీలు.. అంతరించిపోతున్న తెలుగువారి సంస్కృతి-సంప్రదాయాలను పరిరక్షించేందుకే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సంప్రదాయ బద్ధమైన ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఈ పండుగను వైభవంగా జరుపుకోవాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

# రాక్షస పాలనకు చరమగీతం పలకండి

### పోలిటబ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసుల రెడ్డి,



కడపజనవరి 10(తరణంవిలేకరి) రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని రానున్న 100 రోజుల్లో పేదల కష్టాలు కడతారుతాయని, రాష్ట్రానికి కొత్త వెలుగు వస్తుందని పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసుల రెడ్డి, కడప నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఆర్.మాధవి, కడప జనసేన పార్టీ ఇన్చార్జి సుంకర శ్రీనివాసులు పేర్కొన్నారు.గురువారం నగరంలోని 5వ డివిజన్లో అశోక్ నగర్ మసీదు వద్ద నుంచి పవన్ కళ్యాణ్. బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ బి సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలలో ప్రధానమైన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు టీడీపీ అధినేత చంద్రబాబు పెద్ద పీట వేశారని అన్నారు. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికిమూడు గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500లు అందిస్తారని. చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగభృతి రూ.3వేలు అందిస్తారని చెప్పారు. బడికి వెళ్లే పిల్లలకు ఇంటిలో ఎంత మంది ఉంటే అంత మందికి సంవత్సరానికి రూ.15వేలు అందిస్తారని చెప్పారు. అభివృద్ధి సంక్షేమం కోసం టీడీపీని గెలిపించి, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసైనికులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

12.01_Thur-Tharanam 1-8.qxd 1/11/2024 8:01 PM Page 8



# జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్

## - మెగా డీఎస్సీ విడుదలచేయకపోతే చరమగీతమే
## -విద్యార్థి యువజన సంఘల నాయకులు హెచ్చరిక.



కడప, చిన్న చౌక్, జనవరి -11-(తరణం విలేఖరి)-రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు ప్రతిఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ విడుదల చేస్తానని నమ్మబలికి నిరుద్యోగులఓట్లు దండుకున్నారని, తీరా అధికారంవచ్చాక విస్మరించారని విద్యార్థి యువజనసంఘం నాయకులు మండిపడ్డారు. వారు నగరంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలోఉన్న ప్రగతినర్సింగ్ హోంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా పిడియస్ యు రాష్ట్రఉపాధ్యక్షుడు ఎం.అంకన్న,డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వీరణాల శివకుమార్,ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయకార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్,పిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి సుబ్బారాయుడు,ఏఐఎస్ బి రాష్ట్ర కార్యదర్శి జాల.జయవర్ధన్,ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు లు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జనవరి ఒకటోతారీఖున జాబ్ క్యాలెండర్ ఇస్తామని నమ్మకబలికి నిరుద్యోగులను మోసంచేశారని, రాష్ట్రంలో సగటున రోజుకొక్క నిరుద్యోగి చొప్పున 4 సంవత్సరాలల్లో 1345 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇందుకు నిదర్శనమే బుధవారం బ్రహ్మంగారిమఠం మండలానికి పాపిరెడ్డిగారి పల్లెకు చెందిన శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఉపాధి కల్పన కార్యాలయంలో యువత యువత తమ పేర్లు నమోదు చేసుకున్న వారిసంఖ్య డిసెంబర్ 2022 నాటికి 6.16 లక్షల మంది నమోదు చేసుకున్నారన్నారు. అదేవిధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సర్కార్ నాలుగేళ్లగా డీఎస్సీ అంటూ నిరుద్యోగ యువతను మోసంచేశారని,రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండవలసినచోట కేవలం 1.69 లక్షలు మాత్రమే వున్నారని ఈ విషయం రాష్ట్రప్రభుత్వం స్వయాన వెల్లడించిందన్నారు.దాదాపు 18,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇవి కాకుండా ఈనెల చివరినాటికీ మరో 5000 మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారన్నారు. రాష్ట్రంలో డీఎస్సీ కోసం దాదాపు 9 లక్షలమంది నిరుద్యోగులు వేచిచూస్తున్నారని వారన్నారు.ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అదేవిధంగా మెగా డీఎస్సీ విడుదల చేయకపోతే రామన్నఎన్నికల్లో నిరుద్యోగ యువతతోకలిసి ప్రచారం నిర్వహించి చరమగీతం పాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మనోజ్,పిడిఎస్ యు జిల్లా కార్యాదర్శి శ్రీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడలు పట్ల ఆసక్తి చూపాలి

## టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు
## చమర్తి జగన్ మోహన్ రాజు
## రాజంపేట నియోజకవర్గం



సిద్ధవటం జనవరి 11 (తరణం విలేఖరి ) మాచుపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయగా తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూయువత ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని ప్రతిభను కనపరచడం అభినందనీయమని,క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు.అంతకుముందు పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ, బ్యాండ్ వాయిద్యాల మధ్య పూల వర్షం కురిపిస్తూ దారి పొడవునా జగన్ మోహన్ రాజు కు ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు యువత మరియు కార్యకర్తలు,ఈ కార్యక్రమంలో టిడిపి సిద్దవటం మండల పార్టీ అధ్యక్షులు జ్యోతి మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ దశరధరామ నాయుడు, స్థానిక నాయకులు, పిచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి,బొద్దే లక్ష్మీనారాయణ నాయుడు, రాజంపేట నియోజవర్గ యువ నాయకులు దారపునేని రాజేష్ నాయుడు (రాజా) పార్లమెంటరీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నాగ ముని రెడ్డి , రాజశేఖర్ యాదవ్, మోదుగుల నర్సింహులు,శివారెడ్డి, హరినాథెడ్డి, శ్రీనివాసులు రెడ్డి , సతీష్ రాజు, జీవీ సుబ్బరాజు, వినోద్ రెడ్డి, షాహుస్సేన్, రహంతుల్లా, బొడిచర్ల శ్రీనివాసులు,శ్రీపతి,నిత్య పూజయ్య ,టోర్నమెంట్ ఆర్గనైజర్ మల్లు రమణారెడ్డి, ,క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి

## ..మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు





(అనకాపల్లి.జనవరి11, తరణం ప్రతినిధి)అనకాపల్లి జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ఆరోపించారు,ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపడితే ఇక్కడి అవినీతి బాగోతం బయటపడుతుందన్నారు.ఈ మేరకు ఆయన మున్సిపల్ శాఖ మంత్రి,చీఫ్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం పైడారావు విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అనకాపల్లి పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కిమ్మనడం లేదని ఆరోపించారు.జీవీఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం ఇచ్చే ప్లాన్ ఒకటి,నిర్మాణం సాగే ప్లాన్ మరొకటి,సర్వే నంబర్ వేరొకటిగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోనంతగా అవినీతి పెరిగిపోయిందని పైడారావు ఆరోపించారు.మున్సిపల్ రికార్డుల్లో 1084/1 సర్వే నంబర్ చెరువు స్థలంగా ఉందన్నారు.ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సర్వే నం.1084/1 చినరామ స్వామి గుడి వద్ద కోణం కప్పి తప్పుడు డాక్యుమెంట్లతో ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, దీనిపై తాను ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు.ఈ సర్వే నెంబర్ లోని స్థలం మున్సిపల్ రికార్డుల్లో ఎస్టేట్ మేనేజర్ రాణి పేరిట 60 సెంట్లుగా ఉందన్నారు.జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ ఉన్న సమయంలో ఈ స్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.ఇప్పుడు అవినీతికి అలవాటు పడిన అధికారులు అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నమే చేయకపోవడం శోచనీయమన్నారు.అనకాపల్లి అంతటా కబ్జాలు సాగుతున్నాయని,మున్సిపల్ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.అనకాపల్లిలో జోన్లో అక్రమాల్లో చర్యలపై నిర్లక్ష్యం చూస్తుంటే జీవీఎంసీ కమిషనర్,చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఈ సందర్భంగా పైడారావు ఆరోపించారు.

# పలువురు అధికారులకు అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ



కమలాపురం, జనవరి 11(తరణం విలేఖరి)కమలాపురం నగర పంచాయితీ పరిధిలోని అయోధ్య శ్రీ రామమందిరం నుంచి వచ్చిన పరమ పవిత్రమైన అక్షింతలు, శ్రీరామ చిత్రపటంతో కూడిన అయోధ్య రామాలయం నమూనా,ఆహ్వాన పత్రికలు పంపిణీ కమలాపురం సి.ఐ.రామకృష్ణారెడ్డి, ఎస్.ఐ.హృషికేశవ రెడ్డి, ఎం.ఆర్.ఓ. సరస్వతి సి.ఎస్.ఎస్.ఆర్.డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తదితర అధికారులకు పరమ పవిత్రమైన అక్షింతలు శ్రీ రామ భక్తులు పంపిణీ చేశారు

# పారిశుధ్య కార్మికుల సంక్షేమమే.. ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

## -సఫాయి కరంచారీ జాతీయ కమీషన్ సభ్యులు డా.పి.పి.వవ
## -జిల్లాలోని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై డిఆర్వో, నగర కమీషనర్, సంబందిత అధికారులతో కలిసి సమీక్ష






కడప, జనవరి 11 (తరణం బ్యూరో): పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రత, సంక్షేమం కోసం.. సఫాయి కర్మచారీ జాతీయ కమీషన్ నిరంతరం పాటుపడుతోందని సఫాయి కరంచారీ కమిషన్ సభ్యులు డా.పి.పి.వవ పేర్కొన్నారు. గువారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో.. జిల్లాలోని సఫాయి కరంచారీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు.. సంబంధిత జిల్లా అధికారులతో.. సఫాయి కరంచారీ వ్యవస్థ జాతీయ కమీషన్ సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశానికి.. సఫాయి కరంచారీ జాతీయ కమీషన్ సభ్యులు డా.పి.పి.వవ తో పాటు.. కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ తుషార్ డూడీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సఫాయి కరంచారీ వ్యవస్థ జాతీయ కమీషనర్ సభ్యులు డా.పి.పి.వవ మాట్లాడుతూ.. ఈ రోజు సమాజం ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా ఉందంటే.. సఫాయి కరంచారీ వ్యవస్థలోని పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమే అన్నారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలు ఆరోగ్యవంతంగా ఉంటేనే.. నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. ప్రత్యేకించి కోవిడ్ విపత్కర సమయంలో పారిశుధ్య కార్మికులు సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ సఫలీకృతంలో.. పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. సఫాయి కరంచారీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమీషన్ ను ఏర్పాటు చేసి.. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. జాతీయ స్థాయిలో నేషనల్ సఫాయి కరంచారీ ఫైనాన్స్ డెవెలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు కూడా అందించడం జరుగుతోందన్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం.. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆవాస్ యోజన ద్వారా హౌసింగ్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మరిన్ని పథకాలకు సంబంధించిన మరిన్ని వివరాలు.. సఫాయి కరంచారీ జాతీయ కమీషన్ వెబ్ సైట్ నందు కూడా పొందుపరచడమైనదన్నారు.అలాగే.. ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, అలాగే.. మహిళా పారిశుధ్య కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కార చర్యలను చేపట్టాలని, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. అలాగే.. ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థలలో ఏజెన్సీల ఆధ్వర్యంలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరికీ ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఖాతాలు నమోదు చేయించాలని, సఫాయి కరంచారీ కార్మికుల కుటుంబాలన్నింటికి హెల్త్ కార్డులను అందించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ.. సఫాయి కరంచారీ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే.. తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే ప్రతి నెలా రెండవ సోమవారం సఫాయి కార్మికుల సమస్యలను విన్నవించేందుకు ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని కూడా అన్ని మున్సిపాలిటీల పరిధిలో అమలు చేయడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి పారిశుధ్య కర్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అన్నింటినీ అందేలా.. చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా... మురికి నిల్వల తొలగింపులో ఎక్కడా కూడా కార్మికులు చెతితో పారిశుధ్య చర్యలను చేపట్టకూడదని.. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వ చట్టం కూడా చేసిందన్నారు. ఎవరైనా అలాంటి పనులను మిషనరీతో కాకుండా మ్యాన్యువల్ గా చేయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అంతకుముందు.. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు చెందిన పారిశుధ్య కార్మికులు హాజరై.. వృత్తి పరంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ కమిషన్ సభ్యులు డా.పి.పి.వవ దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్య కార్మికులకు విధులు నిర్వహించే కార్యాలయాల్లో టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని, ఈఎస్ఐ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్య సదుపాయాలు అందడం లేదని, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాట్లు.సురక్షితంగా ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్మికులకు జీతాలు క్రెడిట్ అయ్యే బ్యాంకుల నుండి లోన్లు ఇప్పించాలని, మృతుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని, చనిపోయిన కార్మిక కుటుంబాలకే కాకుండా...రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే ఆదివారం సెలవు దినాలు అమలు చేయాలని, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సఫాయి కార్మికులకే అప్పగించాలని గౌరవ సభ్యులను పలువురు పారిశుధ్య కార్మికులు కోరారు..పారిశుధ్య కార్మికులు, యూనియన్ నాయకులు తెలిపిన సమస్యలన్నింటినీ స్వీకరించిన కర్మచారీ జాతీయ కమీషన్ సభ్యులు డా.పి.పి.వవ.. వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్థానికంగా పరిష్కరించదగిన సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, కడప నగర కమీషనర్ లకు రెఫర్ చేశారు. రాష్ట్ర స్థాయిలో పరష్కరించాల్సిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని ఆయన కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో , జెడ్పి సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, ఎస్సి, బిసి కార్పొరేషన్ల ఈడిలు డా. హెచ్. వెంకట సుబ్బయ్య, జయసింహ, ఎస్.ఎస్.ఏ. పివో డా. ప్రభాకర్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, సంబందిత శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల కమీషనర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సఫాయి కరంచారీ యూనియన్ నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఠాగూర్ ని కలిసిన అతెంజెరి శ్రీనాథ్



రాజంపేట. జనవరి. 11 (తరణం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇంచార్జ్ తొలిసారి రాష్ట్రానికి విచ్చేసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ మాణిక్యం ఠాగూర్ ని గురువారం విజయవాడ వివంత హొటల్ మర్యాద పూర్వకంగా కలిసిన పీసీసీ కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్

# ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ ప్రారంభించిన రాష్ట్ర హార్టికల్చర్ ప్రభుత్వ సలహాదారు.

## సంబ టూరు ప్రసాద్ రెడ్డి.



కమలాపురం, జనవరి 11(తరణం విలేకరి)కమలాపురం పట్టణం సి.ఎస్.ఐ.ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రాక్రికెట్ మ్యాచ్ ను రాష్ట్ర హార్టికల్చర్ ప్రభుత్వ సలహాదారు సంబ టూరు ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు.ఇరు జట్ల ఆటగాళ్ళను పరిచయం చేసుకొని టాస్ వేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామం , పల్లెల్లోని సచివాలయం పరిధిలో సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశ్యంతో ఆటల పోటీలు నిర్వహస్తున్నా రన్నారు.గెలుపోట ములు సహజమని క్రీడాస్ఫూర్తితో ఆడి స్నేహభావాన్ని పెంపొందించుకోవాలన్నారు.యువత చదువు, ఉద్యోగాలతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KANAGUDURU NAGINI, PRINTED AT MARUTHI WEB PRINTERS, DOOR NO. 31/41 DEVUNI KADAPA, PATHAKADAPA, PATHAKADAPA VILLAGE, CUDDAPAH MANDAL, Y.S.R / KADAPA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT 31/41 BRAHMIN STREET, DEVUNI KADAPA, PATHA KADAPA, YSR/KADAPA-516002, DISTRICT KADAPA, ANDHRA PRADESH. EDITOR : N. ANJANEYA REDDY. RNI NO: APTEL/2016/69526, Cell : 7013748049 Email: tharanamkvsm@gmail.com.